# ప్రేమ జంటలే టార్గెట్!

**- బెదిరించి నగదు, నగలు దోచుకోవడమే వృత్తి**
**- నిందితుడిని అరెస్టు చేసి రూ.2 లక్షలు విలువైన నగలు, వాహనం స్వాధీనం చేసుకున్న వన్‌టౌన్ పోలీసులు**


అకిల్‌ను అరెస్టు చేసి వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్

చిత్తూరు, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: చిత్తూరు నగర పరిసరాల్లో పార్కులు, అటవీ ప్రాంతాలు, నిర్మానుష్య ప్రాంతాల్లో ఏకాంతంగా గడపడానికి వచ్చిన ప్రేమ జంటలను టార్గెట్ చేసి వారి నుండి నగలు, నగదు దోచుకునే ఓ నిందితుడిని చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్ వెల్లడించిన వివరాల మేరకు చిత్తూరు కొంగారెడ్డిపల్లి చెందిన ఆర్.అకిల్(30) నిర్మానుష్య ప్రదేశాల్లో ఏకాంతంగా వుండే ప్రేమ జంటలను టార్గెట్ చేసి వారిని కత్తులతో బెదిరించి నగలు, డబ్బులు దోచుకునేవాడన్నారు. ఈ మేరకు ఇటీవల చిత్తూరు నగర పరిధిలో జనసంచారం తక్కువగా వుండే ప్రాంతాల్లో ఒంటరిగా వుంటున్న ప్రేమ జంటలను టార్గెట్ చేసి నగలు, డబ్బులు దోచుకెళ్ళడంతో గుర్తు తెలియని వ్యక్తులు తమ నుండి డబ్బులు, నగలు దోచుకెళ్ళారని ఫిర్యాదు చేయడం జరిగింద న్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్, సిబ్బందికి శుక్రవారం పివికెఎన్ డిగ్రీ కళాశాల వెనుకవైపు వున్న అటవీ ప్రాంతంలో అకిల్ వుండటంతో అనుమానస్పదంగా అరెస్టు చేసి విచారించగా అతని వద్ద 12 గ్రాములు బరువు వున్న రెండు చైనులు, నేరంకు ఉపయోగించిన ఒక వాహనంను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అకిల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్ వెల్లడించారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





# పిఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా... పారిశ్రామికవేత్తలు ఆవిర్భావం

**- జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి**

చిత్తూరు, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: మహిళా సంఘాల సభ్యులు, రైతు సంఘాల సభ్యులు ప్రధానమంత్రి సూక్ష్మ ఆహారశుద్ధి పరిశ్రమల క్రమబద్దీకరణ పథకంను సద్వినియోగం చేసుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి పేర్కొన్నారు. డిఆర్‌డిఎ సమావేశభవనంలో శుక్రవారం వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులపై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమానికి హాజరైన డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి మాట్లాడుతూ వ్యవసాయ, దాని అనుబంధ శాఖలపై అవగాహన వున్న ప్రతి ఒక్కరు ఈ పథకంను వినియోగించు కోవచ్చునన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ వ్యాపారానికి అన్ని విధాలుగా తోడ్పాటు అందించి ఆధునిక సాంకేతికతతో సంఘటిత రంగాల్లో వ్యాపారస్తులుగా నిలబెట్టడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. జిల్లాలో టమోటా, మామిడి, బెల్లం, జామ తదితర ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అనువైన ప్రాంతమని, దీనిని దృష్టిలో వుంచుకుని చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ఆసక్తి వున్న వారు ముందుకు రావాలన్నారు. ఈ పథకం ద్వారా యూనిట్ వ్యయంలో 10 శాతం లబ్దిదారుడి వాటా పెట్టుబడిగా పెట్టాలని, మిగిలిన 90 శాతం బ్యాంకు రుణ సౌకర్యం కల్పించడంతో పాటు రుణ మొత్తంలో 35 శాతం సబ్సిడీ రూపంలో ప్రభుత్వం అందిస్తోందన్నారు. హార్టికల్చర్ డిడి మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మధ్య తరహా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు మంచి అనువైన వాతావరణం వుందని, దీనిని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వం అందించే ప్రోత్సహకాలను అందిపుచ్చుకుని యూనిట్లు ఏర్పాటు చేసి లాబాలు ఆర్జించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రతినిధి మ్యాజ్యూస్ డిసిఎం రవికుమార్, ఎపిఎంలు మధు, సుబ్బారెడ్డి, గోపాల్‌రెడ్డి, హేమలు, పలువురు స్వయం సహాయక సంఘాల సభ్యులు, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


రైతు సంఘాల ప్రతినిధులకు పిఎంఎఫ్ఎంఇపై అవగాహన కల్పిస్తున్న డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి

# నగల దుకాణంలో చేతివాటం

**-పోలీసుల అదుపులో కిలాడీ లేడీలు**



పలమనేరు టౌన్, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: పలమనేరు పట్టణంలోని బజారువీధిలో బాలాజీ స్వర్ణ మహల్‌లో చోరీ యత్నం జరిగింది. తమిళనాడుకు చెందిన ఇద్దరు కిలాడీ లేడీలు చాకచక్యంగా 8 గ్రాముల బంగారునగలు అపహరించి సిసి కెమెరాలకు చిక్కి పోలీసులకు పట్టుబడ్డారు. గురువారం రాత్రి ఇద్దరు మహిళలు బంగారు కమ్మలు కావాలని దుకాణంలో ప్రవేశించారు. అక్కడ పనిచేసే వారు కమ్మలు లెక్కించి ట్రేలో వుంచి ఇవ్వగా మహిళలు చూస్తున్నట్లు నటిస్తూ తమ వద్ద ఉన్న రెండు గ్రాముల కమ్మలు ట్రేలో వుంచి ట్రేలో వున్న 8 గ్రాముల కమ్మలు అపహరించారు. ఈ విషయం గుర్తించిన పనివారు నిలదీయగా అపహరించిన కమ్మలు తమవేనని బుకాయించారు. దుకాణం యజమాని వచ్చి సిసి కెమెరాల్లో జరిగిన చోరీని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో మహిళలు తాము తప్పు చేశామని వదిలేయమని కాళ్ళా వేళ్ళా పడ్డారు. మహిళలు పారి పోకుండా దుకాణం పనివారు తలుపులు మూసి అడ్డుకున్నారు. ఎస్ఐ లోకేష్ సిబ్బందితో వచ్చి మహిళలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# బ్రహ్మోత్సవాల్లో... భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం

**-గరుడసేవరోజు భక్తులకు 14 రకాల వంటకాలు -24ప్రాంతాల్లో 4వేల వాహనాలకు పార్కింగ్**
**-3వేల సిసికెమెరాలతో నిఘా -అన్నిశాఖల సమన్వయ సమావేశంలో టిటిడి ఈఓ సింఘాల్**

తిరుమల, సెప్టెంబర్ 19ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవారికి 24వతేదీ నుండి తొమ్మిదరోజులు జరిగే బ్రహ్మోత్సవాల్లో సాధారణ భక్తులకు సౌకర్యవంతంగా మూలవిరాట్టుతో బాటు వాహనసేవల వీక్షణం కల్పిస్తున్నామని టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్ తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రణాళికలు రూపొందించి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. గరుడసేవ రోజు రాత్రి భక్తులకు 14రకాల వంటకాలు తయారుచేసి పంపిణీ చేస్తామన్నారు. తిరుమలలో 24ప్రాంతాల్లో 4వేల వాహనాలకు సరిపడే పార్కింగ్ వసతి కల్పించామన్నారు. బ్రహ్మోత్సవాల్లో అదనంగా 3వేల సిసికెమెరాలతో నిఘా ఉంచుతామని, అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుని భక్తులకు చిన్నపాటి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. సాలకట్ల బ్రహ్మోత్సవాలు సమీపిస్తుండటంతో శుక్రవారం మధ్యాహ్నం అన్నమయ్య భవనంలో టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఈఓ వీరబ్రహ్మం, జిల్లా యంత్రాంగం తిరుపతి కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ, తిరుపతి కమిషనర్ మౌర్య, అన్నివిభాగాలతో కలసి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో అందరూ టీమ్‌గా భక్తులకు అవసరమైన సేవలందిస్తారని తెలిపారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టామన్నారు. 9.50కోట్ల రూపాయలతో సివిల్ ఇంజనీరింగ్ పనులు, 5.50 కోట్ల రూపాయలతో విద్యుద్దీ పాలంకరణలు, దాతల విరాళాల ద్వారా 3.50కోట్లతో పుష్పాలంకరణ చేపడుతు న్నామన్నారు. పుష్పాలంకరణకు 60 టన్నులు పుష్పాలు వినియోగిస్తున్నట్లు ఈఓ చెప్పారు. అన్ని రకాల దర్శనాలు రద్దుచేశామని, రోజుకు 25వేల టైమ్‌స్లాట్ టోకెన్లు (గరుడసేవ రోజు తప్ప) జారీ చేస్తామన్నారు.


అన్నమయ్య భవనంలో అన్ని విభాగాల అధికారులతో ఇఒ సమీక్ష

తిరుపతిలో పార్కింగ్ ప్రాంతాలనుండి తిరుమలకు ఆర్టీసి బస్సులు నడుపుతున్నామన్నారు. 2వేల మంది టిటిడి భద్రత సిబ్బంది, 450మంది సీనియర్ అధికారులు విధులు నిర్వహిస్తారన్నారు. 3,500మంది శ్రీవారి సేవకుల ద్వారా సేవలందిస్తారు. పారిశుధ్యంకోసం 2,300మంది సిబ్బందితో బాటు 960మంది అదనపు సిబ్బంది నియామకం, కల్యాణకట్టలో 1,150మంది క్షురకులు అందుబాటులో ఉంటారన్నారు. అత్యవసర వైద్యసేవలకు 14 అంబులెన్స్‌లు అందుబాటులో ఉంటాయన్నారు. ఆలయ మాఢవీధుల్లో గ్యాలరీల్లో 2లక్షలమంది భక్తులు వాహనసేవలు వీక్షించే అవకాశం ఉందన్నారు. 20 హెల్ప్‌డెస్క్‌లు ,ఐదు భాషల్లో భక్తులకు సమాచార వ్యవస్థను కల్పించామన్నారు. ఈ మీడియా సమావేశంలో టిటిడి సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, పిఆర్ఓ నీలిమ, తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్, విఎస్ఓ ఎస్టీవిరామ్‌కుమార్, సురేంద్ర పాల్గొన్నారు. భక్తులు తిరుమలలో ఒకచోట నుండి ఏప్రాంతానికి ఎలా చేరుకోవాలనే మ్యాప్‌ను ఇంజనీరింగ్ విభాగం సిద్దంచేసి అన్ని ప్రధాన కూడళ్ళవద్ద, విచారణ కార్యాలయాల వద్ద ఏర్పాటుచేసింది.

## రికార్డు స్థాయిలో కాణిపాకం ...
# హుండీల ద్వారా 2.39 కోట్లు ఆదాయం



కాణిపాకం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా రికార్డు స్థాయిలో 2.39 కోట్లు రూపాయలు ఆదాయంగా వచ్చింది. శుక్రవారం స్థానిక ఆస్థాన మండపంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ ఆధ్వర్యంలో ఆలయ హుండీలను లెక్కించారు. ఈసందర్భంగా 30 రోజులకు గాను హుండీల ద్వారా 2,39,09,202 రూపాయలు ఆదాయంగా లభించింది. అలాగే 54 గ్రాముల బంగారు, ఒక కిలో 910 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చింది. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా 29,485 రూపాయలు ఆదాయంగా వచ్చింది. నిత్యాన్నదాన హుండీ ద్వారా 67,339 రూపాయలు ఆదాయంగా లభించింది. దీనితో పాటు 157అమెరికా డాలర్లు, 15 ఇంగ్లాండ్ ఫౌండ్, 572 యూఏఈ దినార్స్, 280 కెనడా డాలర్లు, 5 యూరో కరెన్సీ,20 ఆస్ట్రేలియా డాలర్లు, 12 సింగపూర్ డాలర్లు,52 మలేషియా రింగిట్స్ ఆదాయంగా వచ్చినట్లు ఆలయ ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు, జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమీషనర్ చిట్టెమ్మ, ఏఈఓలు రవీంద్రబాబు, ఎస్వీ.కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, ధనుంజయ, ధనపాల్, ప్రసాద్, సీఎఫ్ఓ నాగేశ్వరరావు, సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, కాణిపాకం యూనియన్ బ్యాంకు, ఆలయ సిబ్బంది, సేవకులు పాల్గొన్నారు.

# ప్రతి నిత్యం అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాత పరమేశ్వరి దేవస్థానంలో ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీచెంగాళమ్మ శరన్నవ రాత్రులను విజయవంతం చేయాలని దేవస్థానం సహాయ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి శుక్రవారం కోరారు. ప్రతి నిత్యం అమ్మవారు ప్రత్యేక అలంకారాలతో దర్శనభాగ్యం కల్పిస్తారన్నారు. దేవస్థానం ప్రాంగణంలో తొమ్మిదిరోజులు పాటు ప్రతి నిత్యం చండీయాగం జరుగుతుందన్నారు. దీంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. మహిషాసురమర్ధని అక్టోబర్ 2వ తేదీన అమ్మవారికి దేవస్థానం తరపున ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పట్టు వస్త్రాలు సమర్పిస్తారని ప్రసన్నలక్ష్మి చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పూజారులు సనిశెట్టి మధు, ఈసరపల్లి రమేష్, హరికుమార్ శర్మ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దేవస్థానం సహాయ కమిషనర్

# మరింతగా భక్తులకు వసతి

**-పిఎసి 5లో ఈఓ,అదనపు ఈఓ తనిఖీలు**



తిరుమల, సెప్టెంబర్ 19 ప్రభాతవార్తప్రతినిధి: భక్తులకు అదనంగా 4వేలమందికి వసతి కల్పించేందుకు పిఎసి 5(యాత్రికుల వసతి సముదాయం) వేంకటాద్రి నిలయం సిద్దమైంది. ఈ వసతి సముదాయాన్ని 25వ తేదీ సిఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఈ వసతి సముదాయాన్ని టిటిడి ఈఓ అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్ఓ మురళీకృష్ణ, సిఇ సత్యనారాయణ, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవితో కలసి అత్యాధునిక సౌకర్యాలను పరిశీలించారు.

**దేవదేవుని ఉత్సవాలకు తిరుమలకొండ సిద్ధం:**



ఏడుకొండల వేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు తిరుమలకొండ సిద్దమైంది. అశేషంగా తరలివచ్చే భక్తులను ఆకట్టుకునే విధంగా కలియుగ వైకుంఠంగా తిరుమలను తీర్చిదిద్దారు. ఒకటేమిటి విద్యుద్దీపాలంకరణలు, పుష్పాలంకరణలు, మాఢవీధుల్లో గ్యాలరీలు వర్షానికి ఇబ్బందిలేకుండా ఏర్పాట్లు చేశారు. ఈ పనులన్నీ పూర్తయ్యాయి. ఆలయం పరిసరాల్లోనేగాక తిరుమల అంతటా పలు రకాల స్వాగత ఆర్చిలు, దేవతామూర్తుల కటౌట్లు వెలిశాయి. తిరుమల దేదీప్యమానంగా కాంతులీనుతోంది.

ప్రభాతవార్త-తిరుమల

**-రక్తంతో సిత్రాలు... టీనేజ్ యువతుల ట్రెండ్**

# శ్రీకాళహస్తిలో 'బ్లడ్‌తో' నయాదందా!

**రక్తంతో తమకు నచ్చిన వారి ఫోటోలను ఆర్ట్ వేయించు కుంటున్నారు?**

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఓ వైపు గంజాయి బ్యాచ్‌లు చెలరేగిపోతున్నారు. మరో వైపు మద్యం విచ్చల విడిగా సేవించి రభస సృష్టిస్తుండగా, కొత్తగా బ్లడ్‌తో సిత్రాలంటూ యువతుల ట్రెండ్ సాగుతుంది. ఇదే అదునుగా పానగల్‌లోని ఓ మెడికల్ షాపు యజమాని సొమ్ములు చేసుకుంటున్నారు. పాఠశాలలకు తల్లిదండ్రులు చదువుకోమని పంపితే అదుపుతప్పుతున్న యువతులు రక్తంతో సిత్రాల వేయించుకోవటానికి ఎగబడుతున్నారు. దాంతో ఏ నిముషం ఏం జరుగుతుందో అంతుపట్టని స్థితి చోటు చేసుకుంది. అయితే అధికారులకు ఇదేమి పట్టదన్నట్లు మారింది. దివ్యక్షేత్రంలో సువర్ణముఖి ఒడ్డు గంజాయి బ్యాచ్‌కు వేదికగా మారింది. పొద్దుగుంకితే స్వర్ణముఖి నది పడమరవైపు ఉన్న బాగా మరమ్మతులు చేసి ఆధునీకరించిన కట్ట అల్లరి మూకలకు వేదికగా మారింది. శ్రీకాళహస్తిలో పానగల్‌లో గత కొంత కాలంగా కొత్త దందా సాగుతున్నట్లు విమర్శలు వినబడుతు న్నాయి. ఇక్కడ గంగమ్మ గుడికి సమీపంలో ఓ ప్రైవేటు మెడికల్ షాప్‌ను కేంద్రంగా మలచుకున్నారు. రక్త సిత్రాలంటూ కొత్త ట్రెండ్‌ను సృష్టి స్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా టీనేజ్‌లో ఉన్న యువతీ యువకులను టార్గెట్ చేసుకొని అక్రమ సంపాదనకు పాల్పడుతున్నారు. ఇక్కడ జరుగుతున్నది ఏమంటంటే ఎలాంటి ప్రిస్కిప్షన్ లేకుండా, డాక్టర్ల సలహా లేకుండా రక్తం తీసుకుంటున్నారు. ఎడిటిఏ ట్యూబ్‌లో వేసి ఇస్తారని, దాన్ని ఆర్టిస్టులకు అందజేస్తున్నారు. ఈ రక్తంతో తమకు నచ్చిన వారి ఫోటోలను ఆర్ట్ వేయించు కుంటున్నారు. స్కూల్‌లో ఉపాధ్యాయులకు ఇంట్లో తల్లిదండ్రులకు తెలియకుండా ఈ తతంగం సాగుతున్నట్లు సమాచారం. ఈ రక్త సిత్రాల కోసం రక్తానికి రూ.100, ఆర్ట్ వేసినందుకు రూ.500లు,ఫ్రేమ్ కట్టినందుకు రూ.200లు అంటూ వసూలు చేసుకుంటున్నారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో రకరకాల దందాలు సాగుతున్నా కట్టడి అనేది లేకుండా పోయింది. ఈ ట్రెండ్‌లో అధికంగా ఆడపిల్లలు చొరవ చూపుతున్నట్లు సమాచారం.



రక్తం తీసుకుంటున్న దృశ్యం

# వ్యక్తి దేశభక్తి ద్వారా... జాతీయ నిర్మాణం

గూడూరు, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: స్థానిక వనజా కృష్ణ కళ్యాణ మండపం నందు ఏబీవీపీ సైదాంతిక శిక్షణా తరగతులు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రాంత సంఘటన కార్యదర్శి సుమన్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘం ఏబీవీపీ అని, విద్యార్థుల సమస్యలు మాత్రమే కాకుండా విద్యార్థులలో దేశభక్తిని పెంపొందిస్తూ వ్యక్తి నిర్మాణం ద్వారా జాతీయ పునర్ నిర్మాణం సాధ్యమవుతుందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు తిరుపతి జిల్లాల నుండి ముఖ్యమైన విద్యార్థి పరిషత్ నాయకులు పాల్గొన్నారు. ఈ రెండు రోజులపాటు అనేక రకాల విద్యార్థి ఉద్యమాలపై, కళాశాలలో ఏబీవీపీ పని పెంచడం ఎలా, విద్యార్థులను దేశభక్తులుగా తీర్చిదిద్దడం ఎలా ఇలా పలు రకాల అంశాల పైన చర్చ కార్యక్రమాలు కూడా జరుగుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమశేఖర్, విభాగ్ సంఘటన కార్యదర్శి సత్యనారాయణ, రెండు జిల్లాల విద్యార్థి పరిషత్ నాయకులు పాల్గొన్నారు.



ఏబీవీపీ సైదాంతిక శిక్షణా తరగతులు

## శ్రీసిటీని సందర్శించిన...
# హెచ్‌సీసీ ప్రతినిధుల బృందం


శ్రీసిటీని సందర్శిస్తున్న హెచ్‌సీసీ ప్రతినిధుల బృందం

సత్యవేడు, సెప్టెంబరు 19 ప్రభాతవార్త: చెన్నైలోని హిందూస్థాన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్(హెచ్‌సీసీ)కు చెందిన 25 మంది ప్రతినిధుల బృందం శుక్రవారం శ్రీసిటీని సందర్శించి, ఇక్కడ వ్యాపార అవకాశాలు, పారిశ్రామిక సామర్థ్యాన్ని పరిశీలించింది. సంస్థ చైర్మన్ గోపినాథ్, వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్ తాతియా నేతృత్వంలో విచ్చేసిన బృందానికి శ్రీసిటీ డైరెక్టర్(సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, వ్యూహాత్మక ప్రయోజనాలు, ఇతర ప్రత్యేకతల గురించి శ్రీసిటీ అధ్యక్షుడు (ఆపరేషన్) సతీష్ కామత్ వారికి వివరించారు. ఈ సందర్శనపై స్పందించిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, వివిధ రంగాల వ్యాపార చర్చల నిర్వహణలో హెచ్‌సీసీ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. పరిశ్రమ, ప్రభుత్వం వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థ మధ్య వారధిగా హెచ్‌సీసీ పాత్రను ఆయన ప్రశంసించారు. వారి పరిశీలనలు, సూచనలు శ్రీసిటీలోని చిన్న, మధ్య తరహా సంస్థల బలోపేతానికి దోహదం చేస్తాయని చెప్పారు. పర్యటనలో భాగంగా శ్రీసిటీ అధికారులతో చర్చల్లో పాల్గొన్న ప్రతినిధులు, వివిధ అంశాల గురించి నిశితంగా ఆరా తీసి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం డైకిన్, వరుణ్ బేవరేజెస్ (పెప్సికో), ఎంఎస్ఆర్ గార్మెంట్స్ పరిశ్రమలను సందర్శించారు. కంపెనీల సాంకేతిక నైపుణ్యాలు, తయారీ విధానాలను పరిశీలించారు. సందర్శనకు సహకరించిన శ్రీసిటీ యాజమాన్యానికి గోపినాథ్ ప్రవీణ్ తాతియా తెలిపారు. శ్రీసిటీ ప్రణాళికపెట్టుబడి అనుకూల వాతావరణాన్ని కొనియాడారు. చెన్నై కేంద్రంగా 1945లో స్థాపించబడిన హిందూస్థాన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సంస్థ, దేశంలోని స్వాతంత్ర, లాభాపేక్షలేని వ్యాపార సంస్థల్లో ఒకటి, వాణిజ్య సంబంధాలను ప్రోత్సహించడం, వ్యాపార విధానాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా ఇది పని చేస్తుంది. వ్యాపారులకు ఆధునిక వ్యాపార మార్గదర్శకాలు, మార్కెటింగ్, ఆర్థిక నిర్వహణ, అంతర్జాతీయ వ్యాపార సంబంధాలు, ఇతర అంశాలపై శిక్షణ ఇస్తుంది.

## సిఎం చంద్రబాబు...
# కుప్పంలో కొత్త 'ట్రెండ్'

**-నామినేటేడ్.. సంస్థాగత పదవుల్లో యువతకు పెద్దపీట**
**-పార్టీ కేడర్ మరింత బలోపేతంకు యాక్షన్ ప్లాన్**



కుప్పం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబునాయుడు తన సొంత నియోజకవర్గం అయిన కుప్పంలో తెలుగుదేశం పార్టీలో కొత్త ట్రెండ్‌కు శ్రీకారం చేట్టారు. పార్టీ కేడర్‌ను ముమ్మందు మరింత బలోపేతం చేసేలా వచ్చే ఎన్నికలకు ఇప్పటినుంచే యాక్షన్ ప్లాన్ రూపొందించి అమలు చేస్తున్నారు. అటు నామినేటెడ్ పదవులు, ఇటు పార్టీ సంస్థాగత పదవుల్లో యువతకు కీలక ప్రాధాన్యత ఇస్తూ పెద్ద పీట వేస్తున్నారు. మరో పక్క సీనియర్లకు కూడా తగు గౌరవం దక్కేలా చర్యలు చేపడు తున్నారు. కుప్పం నియోజకవర్గంలో నామినేటెడ్ పదవుల్లో కీలకమైన కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (రెస్కో), కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ, కడ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ, సింగిల్‌విండోల కార్యవర్గాల్లో యువతకు ప్రాధాన్యత ఇచ్చారు. తాజాగా ప్రకటించిన మండల పార్టీ అధ్యక్ష స్థానాల్లో సైతం యువతదే కీలకపాత్ర. ఇలా అటు నామినేటెడ్, ఇటు సంస్థాగత పదవుల భర్తీలో సిఎం చంద్రబాబునాయుడు అటు ప్రజలు, ఇటు కార్యకర్తల అభిప్రాయాలు పరిగణనలో తీసుకుని పదవులు భర్తీ చేస్తున్నారు.

**భవిష్యత్తు యువతరానిదే :**

తెలుగుదేశం పార్టీ పరంగా కుప్పంలో భవిష్యత్తులో మరింత మంది యువనాయకులను తయారు చేయాలనే దిశగా సిఎం చంద్రబాబు నాయుడు ముందుకు సాగుతున్నారు. సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో కుప్పం తెదేపా బాధ్యతలు చూస్తున్న ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్‌తో పాటు పికెఎం ఉడా ఛైర్మన్‌గా నియమితులైన బిఆర్ సురేష్‌బాబు కూడా యువతరం వారే. ఇప్పటికే ప్రకటించిన పదవుల్లో రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజులు యువకులే. వీరి పాలకవర్గాల సభ్యుల్లో సైతం చాలామంది యువతకే చోటు దక్కింది. ఇక మండల పార్టీ అధ్యక్షులుగా సైతం యువకులే నియమితులయ్యారు. నామినేటెడ్ పాలకవర్గాలు, కడ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ, పార్టీ సంస్థాగత పదవులు, పిఎసిఎస్ పదవులు పొందిన వారిలో చాలామంది యాభై ఏళ్ల కంటే తక్కువ వయసు ఉన్నవారే ఉండడం విశేషం. ప్రస్తుతం పదవులు పొందిన వారు వచ్చే ఏడాది జరగనున్న స్థానిక పోరుకు సంబంధించి ఇప్పటినుంచే సమాయత్తం అవుతున్నారు.

## సైబర్ నేరగాళ్ళ పట్ల అప్రమత్తం : సిఐ



**పలమనేరు టౌన్, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్ళ పట్ల అప్రమత్తంగా వుండాలని పలమనేరు సిఐ మురళీమోహన్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ రెండు మూడు నెలలుగా పలమనేరు పోలీస్ స్టేషన్ పరిధిలో కొందరు సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు సమాచార అందిందని దీనిపై ఇప్పటికే కొంత మంది తనకు ఫిర్యాదు చేశారని వివరించారు. గుర్తు తెలియని వ్యక్తులు పోన్లు చేసి తాము పోలీసు అధికారుల మని చెబుతూ మీ ఆధార్ కార్డు, ఫోన్ సిమ్ కార్డు ఇంటర్ నేషనల్ కాల్స్‌తో లింక్ అయిందని దీనివల్ల మీ బ్యాంకు డిపాజిట్లలో మొత్తం ఖాళీ అవుతుందని భయబ్రాంతులకు గురిచేస్తున్నారని హెచ్చరించారు. ఇలాంటి ఫోన్‌కాల్స్ వస్తే వెంటనే తన ఫోన్ నెంబర్ 9440796733కి తెలియజేయాలని సూచించారు.

## పలమనేరులో దస్తా వేజు లేకరుల పెన్‌డౌన్



**పలమనేరు, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:** ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో కొత్తగా తెచ్చిన (2.0)జిఒ వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపిస్తూ రాష్ట్ర దస్తావేజు లేకరుల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు పలమనేరులో దస్తావేజు లేకరులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ఈ నెల 19, 20 తేదీల్లో పెన్ డౌన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం పలమనేరు శాఖ నాయకుడు శ్రీధర్‌నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టి జిఒ ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఈ రెండు రోజులు ఎలాంటి దస్తావేజులు రిజిస్టేషన్లు ఉండవని ప్రజలు సహకరించాలని కోరారు.

## కాలనీల్లో కనీస సౌకర్యాలు నిల్ : ఎస్‌డిపిఐ



**పలమనేరు, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త:** పలమనేరు సమీపంలోని గంటావూరు కాలనీ, వైఎస్ఆర్ కాలనీ, గద్దూరు కాలనీల్లో కనీస సౌకర్యాలు లేవని సోషల్ డెమోక్రటీ పార్టీ (ఎస్‌డిపిఐ) నాయకులు ఆరోపించారు. శుక్రవారం ఈ కాలనీల్లో పలువీధులు వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ ఈ కాలనీలు ఏర్పాటై 15 ఏళ్ళు పైబడుతున్నా కనీస సౌకర్యాలకు నోచుకోలేదని ఆరోపించారు. పార్టీ నాయకుడు మహ్మద్ రోషన్ మాట్లాడుతూ ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తెస్తామని సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాడుతామని హామీ ఇచ్చారు. సమస్యలపై మున్సిపల్ కమీషనర్ రమణారెడ్డికి వినతి పత్రం అందజేశారు.

## పరివాహన ప్రాంతంలో ప్రజలు అప్రమత్తం: కమీషనర్



**చిత్తూరు, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:** నగర పరిధిలోని నీవా నది పరివాహక ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా వుండాలని మున్సిపల్ కమీషనర్ నరసింహ ప్రసాద్ పేర్కొన్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో నీవా నదిలో ప్రవాహం పెరగడంతో కల్వర్టులపై నీరు ప్రవహిస్తోంది. ఈ మేరకు కమీషనర్ నరసింహప్రసాద్ శుక్రవారం తేనెబండ, వీరభద్రకాలనీ, ధర్మరాజుల గుడి ప్రాంతాల్లో నీటి ప్రవాహ పరిస్థితులను పర్యవేక్షించారు. నీటి ప్రవాహ పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ స్థానిక ప్రజలను అప్రమత్తం చేయాలని సంబంధిత అధికారులను కమీషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు రైతు సేవా కేంద్రాల్లో యూరియా పంపిణీ

**యాదమరి, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పత్రపల్లి, తెల్లరాళ్ళపల్లి, దాసరపల్లి, వరదరాజులపల్లి రైతు సేవా కేంద్రాల్లో శనివారం నుండి రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి దీప తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో ఉదయం 8 గంటల నుండి యూరియా పంపిణీ జరుగుతుందని యూరియా అవసరమైన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకాలను తీసుకువచ్చి యూరియా కొనుగోలు చేసుకోవచ్చునన్నారు.

## పక్కాగా ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ

– జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్



**చిత్తూరు, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:** ఓటరు సమగ్ర వివరణ, ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణను పక్కాగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల సహాయ అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ స్పష్టం చేశారు. చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో శుక్రవారం చిత్తూరు, నగరి, పూతలపట్టు, జిడినెల్లూరు నియోజకవర్గాల ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్లు, బిఎల్ఓలతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ఆఫ్ ఎలక్ట్రోరల్ డేటా అంశంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగరి ఆర్డీఓ అనుపమ, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మోహన్‌కుమార్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం దేశ వ్యాప్తంగా ఓటరు సమగ్ర సవరణ ప్రక్రియ అమలు చేయనుందని, బీహార్ అసెంబ్లీ ఎన్నికల అనంతరం దేశ వ్యాప్తంగా ఈ ప్రక్రియ చేపట్టాలని ఎన్నికల సంఘం యోచిస్తోందన్నారు.చిత్తూరు అర్బన్ తహసిల్దారు కులశేఖర్ పాల్గొన్నారు.

## స్మశానానికి దారి సౌకర్యం కల్పించిన కలెక్టర్



**గుడిపాల, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:** మండల పరిధిలోని చలిచీమలపల్లి కాలనీ వాసులకు శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ స్మశానానికి దారి సౌకర్యం కల్పించారు. చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌హైవే నిర్మాణంలో భాగంగా అధికారులు చలిచీలమపల్లి కాలనీ స్మశాన దారిని పూడ్చివేశారు. ఈ మేరకు కాలనీ వాసులు తమ స్మశానంకు వున్న దారిని ఎక్స్‌ప్రెస్ హైవే అధికారులు మూసి వేశారని ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం నేరుగా ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మించిన ప్రదేశానికి చేరుకుని గ్రామస్తులు చెప్పిన స్మశాన దారి సమస్యను పరిశీలించారు. ఈ మేరకు అక్కడ నిజంగానే స్మశానికి దారి లేకపోవడంను గుర్తించి జాతీయ రహదారికి ప్రక్కన కొంత మేరకు స్మశానానికి దారి కల్పించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు శ్రీనివాసులు, ఎంపిడిఓ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

**గుడిపాల, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:** చిత్తూరు-వేలూరు రహదారిలో పానాటూరు గ్రామ సమీపంలోని కృష్ణ గ్రానైట్ ఫ్యాక్టరీ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. వేలూరు నుండి చిత్తూరు వైపుకు వస్తున్న టెంపో ట్రావెలర్ అదుపు తప్పి నడచి వెళ్తున్న వృద్ధుడిని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు కావడంతో ఎస్ఐ రామ్మోహన్ చికిత్స నిమిత్తం అతనిని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## భార్యపై హత్యాయత్నం చేసిన భర్త అరెస్ట్ : డిఎస్పీ



**కుప్పం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త :** కట్టుకున్న భార్యపై కత్తితో హత్యాయత్నానికి పాల్పడిన భర్తను అరెస్ట్ చేసినట్లు కుప్పం డిఎస్పీ పార్థసారథి తెలిపారు. మండలంలోని బైరప్ప కొటాలుకు చెందిన మైనర్ బాలికను తమిళనాడుకు చెందిన రాజేష్ రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడన్నారు. అనంతరం బాలిక గర్భవతి అయి కుమారుడికి ఐదునెలల క్రితం జన్మనిచ్చిందన్నారు.అయితే మూడు నెలలుగా తన భార్య అయిన మైనర్ బాలికను కాపురానికి రావాలని రాజేష్ ఒత్తిడి చేసేవాడన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 17వతేది రాజేష్ అత్తగారి ఇంటికి వచ్చి తన భార్య అయిన మైనర్ బాలికపై అక్రమ సంబంధం ఆరోపణలు చేస్తూ మచ్చుకత్తితో విచక్షణా రహితంగా దాడి చేసి పారిపోయాడన్నారు. బాధితురాలి తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు శుక్రవారం కుప్పం ఫ్లైఓవర్ వంతెన వద్ద నిందితుడు రాజేష్‌ను అదుపులో తీసుకుని మచ్చుకత్తిని స్వాధీనం చేసుకున్నటు తెలిపారు.అర్బన్ సిఐ శంకరయ్య, ఎస్సై బాబు పాల్గొన్నారు.

## క్రీడా పోటీల్లో విజలాపురం విద్యార్థుల ప్రతిభ

**రామకుప్పం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:** స్కూల్ గేమ్స్ నియోజకవర్గ స్థాయి పోటీల్లో విజలాపురం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు హెచ్‌ఎం రమేష్ తెలిపారు. అండర్ 14 విభాగంలో కబడ్డీ, రన్నింగ్ రేస్, జావెలిన్ త్రో పోటీల్లో విద్యార్థులు రాణించి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థులనుమాజీసర్పంచ్‌శ్రీనివాసులురెడ్డి,ఎస్‌ఎంసిచైర్మన్ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

## పుంగనూరును ప్లాస్టిక్ రహిత చేద్దాం

***పుంగనూరు రూరల్, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త*** పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా చేద్దామని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హి సేవా ప్రచారం సందర్భంగా పుంగనూరు మునిసిపాలిటీ విశేష కార్యక్రమాలు చేపట్టింది. మునిసిపాలిటీ కమిషనర్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే దిశగా శుక్రవారం నుంచిచర్యలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో కార్యాలయ సిబ్బందికి ప్లాస్టిక్ బాటిల్ వాడకాన్ని నిలిపివేసే ఉద్దేశ్యంతో స్టీల్ వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమం ప్రతి ఒక్కరిలో చైతన్యం కలిగించనుంది. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్న మునిసిపాలిటీ, పుంగనూరును ప్లాస్టిక్ రహిత మునిసిపాలిటీగా ప్రకటించినట్లు అధికారికంగా తెలిపింది.

## శాస్త్రసోక్తంగా ప్రదోషకాల పూజ



**కాణిపాకం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంభిగా సమేత మణికంఠేశ్వరా యలంలో శుక్రవారం ప్రదోషకాల పూజలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈమేరకు శుక్రవారం సాయం త్రం ఆలయంలో ప్రదోష కాలమందు ఆలయ అర్చకులు వేదపండితులు మంత్రోచ్చారణ నడుమ స్వామివారి మూల విరాట్‌తో పాటు స్వామివారి వాహనం నందికి ఏకకాలంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

## వరసిద్ధుని సన్నిధిలో ఆలయ నూతన ఛైర్మన్

**కాణిపాకం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:**



కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ది వినాయకస్వామి దేవస్థానం ఛైర్మన్‌గా నియమితులైన వి.సురేంద్ర బాబు అలియాస్ మణినాయుడు గురువారం రాత్రి ఆలయంలో స్వామివారిని దర్శించు కున్నారు. ఆలయ ఛైర్మన్‌గా నియమితులైన వెంటనే ఆయన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలసి స్వామివారిని దర్శించుకున్నారు.దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ రాజగోపురం వద్ద ఏఈఓ రవీంద్రబాబు,అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట మండల టీడీపీ అధ్యక్షుడు హరిబాబునాయుడు, స్థానిక మాజీ సర్పంచ్ మదుసూధన్‌రావు, జిల్లా పార్టమెంట్ కార్యనిర్వహక కార్యదర్శి నరసింహులు నాయుడు,కాకర్ల హేమాద్రినాయుడు, నాయకులు మల్లికార్జుననాయుడు, విక్రమ్, మురళీ, ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కుప్పంలో వందశాతం సోలరైజేషన్‌కు చర్యలు



– రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్

**కుప్పం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:** సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం నియోజకవర్గంలో వందశాతం సోలార్ విద్యుద్దీకరణ (సోలరైజేషన్)కు చర్యలు చేపడుతున్నట్లు రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధి కమతమూరు గ్రామంలో సోలార్ ఎల్ఇడి లైట్లను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సోలార్ విద్యుద్దీకరణతో పర్యావరణ హితంతో పాటు విద్యుత్ ఆదా సైతం కలుగుతుందన్నారు. అన్ని గ్రామాల్లో సోలార్ ఎల్ఇడి లైట్ల ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, కడ సభ్యుడు రాజ్‌కుమార్, టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, రెస్కో ఎండి సోమశేఖర్, కమీషనర్ శ్రీనివాసరావు, రెస్కో వైస్ ఛైర్మన్ విశ్వనాథ్, రెస్కో డైరెక్టర్లు ఆర్ముగ ం, అనసూయ, శివ, శరణ్‌కుమార్, తులసినాథ్, అమీర్, కార్పోరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాలు నిర్వహిస్తే చర్యలు



**కుప్పం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:** ఎవరైనా బాల్య వివాహాలు నిర్వహిస్తే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కౌన్సిలర్ జాకీర్, నోడల్ హెచ్‌ఎం వెంకటేష్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం మూడో సచివాలయంలో బాల్య వివాహాల నిర్మూలనపై జరిగిన కార్య క్రమంలో వారు మాట్లాడారు. అలా కాక ఎవరైనా వివాహాలు చేస్తే మహిళా పోలీసులు, ఐసిడిఎస్ లేదా పోలీసు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## కుప్పంలో దస్తావేజు లేఖరుల పెన్ డౌన్



**కుప్పం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:** స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పనిచేసే దస్తావేజు లేఖరులు శుక్రవారం పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహించారు. రిఆధార్ ఒటిపి తో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. సిఎఆర్‌డి ప్రైమ్ సాఫ్ట్‌వేర్‌లో సాంకేతిక లోపిఆలతో దస్తావేజుల తయారీ జటిలంగా మారుతోందన్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో మహేం ద్ర, రామస్వామి, జగన్నాధరెడ్డి, రఘుస్వామి, తారాబాయ్ తదితరులు పాల్గొన్నారు.

## బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ



**చిత్తూరురూరల్, సెప్టెంబరు 19 ప్రభాతవార్త:** మాస మహిళా దినోత్సవంను పురస్కరించుకొని చిత్తూరు ప్రధాన ప్రభుత్వఆసుపత్రిలోని గర్భిణులు, బాలింతలకు సత్యసాయి సేవా సమితి సభ్యులు శుక్రవారం పౌష్టికాహారంను పంపిణీ చేసారు. ముందుగా ఆసుపత్రి ప్రాంగణంలోని ధన్వంతరి వినాయకస్వామికి పూజలు నిర్వహించి వెటర్నటీ వార్డులోని బాలింతలు, గర్భిణీలకు ప్రొటీన్ పుడ్స్, చిన్నపిల్లలకు దుస్తులను క్యారీ బ్యాగులో వుంచి సుమారు 50మందికి పంపిణీ చేసారు. ఈ సేవా కార్యక్రమంలో సేవాదళ్ సభ్యులు రుక్మిణి, రత్న, గౌరీ, కాంత తదితరులు పాల్గొన్నారు.

## రేపు మెగా ఉచిత కంటి వైద్య శిబిరం

కుప్పం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త : సాయిమాతా సేవా ట్రస్ట్ అధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, బెంగళూరు శంకర కంటి ఆస్పత్రి వారిచే ఈనెల 21న ఆదివారం కుప్పం బాలుర హైస్కూల్‌లో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు డిఎన్ జగదీష్‌బాబు తెలిపారు. కంటి జబ్బులతో బాధపడేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9391833999నెంబరును సంప్రదించాలని కోరారు.

## నీటి సమస్య పరిష్కారం



**కుప్పం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:** మున్సిపల్ పరిధి గుల్లేపల్లి గ్రామంలో మంచినీటి సమస్యను మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్ చొరవ చూపి పరిష్కరి ంచారు. మున్సిపాలిటీ ద్వారా గ్రామంలో నూతనంగా పైప్‌లైన్ ఏర్పాటుచేయించి తాగునీటి సమస్యను పరిష్కరించారు. దీంతో గ్రామస్తులు సిఎం చంద్రబాబు నాయుడుకు, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్టీ కుటుంబాలకు పూర్తి స్థాయి సౌకర్యాల కల్పన

**శాంతిపురం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త :** మండలంలోని నక్కనపల్లి గ్రామంలో ఉన్న షెడ్యూల్ తెగల కుటుంబాలకు ఉన్నతాధికారుల ఆదేశాలతో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పిస్తా మని ఎంపిడిఓ పిఆర్ కుమార్, తహశీ ల్దార్ శివయ్య పేర్కొన్నారు. శుక్రవారం గ్రామంలో పర్యటించి షెడ్యూల్ కులాల వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇదివరకు శివరాంపురం గ్రామం ఒడ్డువంక వద్ద గల ఎస్టీలకు రేషన్,ఆధార్,హెల్త్ కార్డు, జనన, మరణ ధృవీకరణపత్రాలు, హౌసింగ్, వ్యక్తిగత మరుగుదొడ్లు, దీపం పథకం మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జనార్ధనరెడ్డి, నేతలు శ్రీరాములురెడ్డి, మురుగేష్, కార్తీక్, కార్యదర్శి ఆదర్శ్, రవితేజ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## సబ్‌స్టేషన్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



**వి.కోట, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:** మండలంలోని లింగాపురం, అన్నవరం విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ట్రాన్స్‌కో ఎస్ఇ ఇస్మాయిల్‌ను మాజీ ఎఎంసి ఛైర్మన్ రామచంద్ర నాయుడు కోరారు. శుక్రవారం ఎస్ఇ వి.కోటలో పర్యటించగా మండలంలోలో ఓల్టేజ్ సమస్య పరిష్కారంకు చర్యలు తీసుకోవాలని ఆయన ఎస్ఇకి వివరించారు. కార్యక్రమంలో ఇఇ శ్రీనివాసమూర్తి, డిఇ జీవన్‌కుమార్, ఎఇ రామకృష్ణ పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కాలువపై దురాక్రమణలు తొలగింపు



**చౌడేపల్లి, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:** యేళ్ళతరబడి పంచాయతీ కాలువను ఆక్రమించుకొన్న వారిపై అధికారులు కొరడా ఝులిపించారు. బస్టాండులోని కేరళాహోటల్ నుంచి పాత పోలీస్టేషన్ వరకు గల ఆక్రమణలు తొలగించి వీధి కాలువ నిర్మాణానికి నాంది పలికారు. గతంలో దాదాపు ఆరు అడుగుల మేర వీధి కాలువ వుండేది. అయితే కొందరు దుకాణదారులు కాలువను కుదిస్తూ ఆక్రమణలకు పాల్పడ్డారు. దీనివల్ల వర్షం కురిసినప్పుడు నీరంతా రోడ్డపైకి వస్తున్నాయి. గుర్తించిన అధికారులు, నాయకులు వీధికాలువ నిర్మాణానికి నడుం బిగించారు. పట్టణ ప్రజలతోపాటు ప్రయాణీకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కూరగాయల దుకాణంలో క్షుద్ర పూజల కలకలం



**చౌడేపల్లి, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:** బస్టాండుకు సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద క్షుద్రపూజలు కలకలం రేపాయి. వెంకటప్పకు చెందిన కూరగాయల దుకాణంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కూరగాయలు, ఇతరత్రా వస్తువులతో పూజలు చేసి వుండటాన్ని యజమాని గుర్తించాడు.

## పౌష్టికాహారమే తల్లీబిడ్డలకు శ్రీరామ రక్ష



**చౌడేపల్లి, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:** పౌష్టికాహారమే తల్లీబిడ్డలకు శ్రీరామరక్షని ఐసిడిఎస్ సూపర్ వైజర్ సులోచనా అన్నారు. మండలంలోని పంచాయతీ కేంద్రం పుదిపట్ల అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మసోత్స వాల్లో భాగంగా తల్లులు, వారి భర్తలకు పోషక విలువలపై అవగాహన నిర్వహించారు. సూపర్ వైజర్ రాధ, అంగన్ వాడీ కార్యకర్తలు, కేంద్రం పరిధిలోని తల్లులు వారి భర్తలు పాల్గొన్నారు.

## ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలి



**సదుం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:** సమాజంలో దివ్యాంగ పిల్లలు ప్రభుత్వం అందజేసే ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్ష జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ వెంకటరమణ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి నటరాజన్ అధ్యక్షతన పుంగనూరు నియోజకవర్గ స్థాయిలో దివ్యాంగుల పిల్లలకు ఉపకరణాల కొరకు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలు సమగ్ర శిక్ష ద్వారా అందించే ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సదుం ఎంఈఓ 2 దామోదర, సహిత విద్య సమన్వయకర్త జగ్గు మధు, పులిచర్ల ఎంఈఓ1 సిద్ధరామయ్య, ఎం ఈ ఓ 2 తాతయ్య , సోమల ఎంఈఓ శివరత్నమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం, నియోజకవర్గంలోని ఆరు మండలాల స్పెషల్ ఎడ్యుకేటర్లు, ఐఈఆర్పిఎస్ భవిత సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్యం వంతమైన సమాజం



**సదుం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:** ఆరోగ్యవంతమైన సమాజం అందరి లక్ష్యం అని పులిచెర్ల ఐసిడిఎస్ సిడిపిఓ వాణి శ్రీదేవి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని 79 చింతమాకుల పల్లె, పాలమంద, కురవపల్లె సచివాలయాల్లో ఎనిమిదవ రాష్ట్రీయ పోషణ మాస ఉత్సవాలు నిర్వహించారు. మంచి పోషకాహారాన్ని తీసుకోవాలని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చెరుకు వారి పల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు చరణ్ కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ మల్లీశ్వరి ఆరోగ్య పర్యవేక్షకులు జానకి, శిఖామణి, నీలకంఠ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునీల్ కుమార్‌రెడ్డి, శంకర,అంగన్వాడి కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు,ఆశావర్కర్లు,సిబ్బంది పాల్గొన్నారు.

## బాలిక ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలి



**పుంగనూరు, సెప్టెంబర్19 ప్రభాతవార్త :** పట్టణంలోని ఓ పాఠశాలలో విద్యార్థిని బాలికపై దాడి చేసిన ఉపాధ్యాయులతో సహా యాజ మాన్యంపై వెంటనే చర్యలు చేపట్టాలని ఐక్య విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు సీమాంధ్ర విద్యార్థి సంక్షేమ సమైక్య రాష్ట్ర అధ్యక్షులు సురేష్,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులువై విజయ్ భాస్కర్ రెడ్డి,ఎన్ ఎస్ యు ఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అమృత్ తేజ్,ఆర్పిఎఫ్ పుంగనూరు పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్ తదితరులు మండల రెవెన్యూ అధికారికి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల హక్కులను పరిరక్షించడానికి మేము నిరంతరం పోరాడతామని విద్యార్థి సంఘాల నాయకులు స్పష్టం చేశారు.

## రాజయోగం సాధనతో ఉత్తమ ఆరోగ్యం



**పుంగనూరు రూరల్, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:** రాజయోగ సాధన ద్వారా మానసిక ప్రశాంతతను పొందవచ్చని, శారీరిక రుగ్మతలు పోగొట్టుకునేందుకు ఒక దివ్య ఔషధంగా రాజయోగం ఉపయోగపడు తుందని బ్రహ్మకుమారీల మోటివేషనల్ స్పీకర్ మంజు అన్నారు. స్థానిక వాసవి కళ్యాణమండపంలో మూడు రోజులు పాటు జరిగే రాజయోగ స్వీయ పరివర్తన కార్యక్రమాలలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా బెంగళూరు నుంచి లీలా దీది, గీతదీది, నిర్మల దీదిలు ప్రసంగాలు చేశారు. కార్యక్రమంలో ఆంధ్ర తెలంగాణ ప్రాంతాలనుంచి వచ్చిన బ్రహ్మకుమారీలు ప్రజల చేత రాజయోగ సాధన చేయించారు.

## ఎంపీడీవోగా అప్పాజీ నియామకం



**పుంగనూరు రూరల్,సెప్టెంబర్ 19 ప్రభాతవార్త :** మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా అప్పాజీ శుక్రవారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు ఆయన నియామకం జరిగింది. ఈ సందర్భంగా అప్పాజీ మాట్లాడుతూ మండలంలోని సమస్యలను సమగ్రంగా గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

## పురుషులు భాగస్వాములు కావాలి



**తవణంపల్లె, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:** అంగన్ వాడీ కేంద్రాల నిర్వహణలో పురుషులు కూడా భాగ స్వాములు కావాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్నం అన్నారు. మండలంలోని కె.పట్నం ఎస్సీ వాడ అంగన్‌వాడీ కేంద్రంలో 'సుపోషిత్ భారత్, సక్షం భారత్' కార్యక్రమంను ఘనంగా నిర్వహిం చారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కే ంద్రంలో పురుషులు, గర్భవతులు, బాలింతలతో సమావేశం నిర్వహించి పౌష్టికాహారం గురించి వివరించారు. ఐసీడీఎస్ సీడీపీఓ నిర్మల ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగరత్నం, అంగన్‌వాడీ కార్యకర్త భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం ఆలయ భద్రతపై అక్టోపస్ సమీక్ష



**కాణిపాకం, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి దేవస్థానం భద్రతపై శుక్రవారం ఆక్టోపస్ భ ద్రతా దళాల అధికారులు సమీక్ష నిర్వహించారు. శుక్రవారం రాత్రి ఆలయం మూసి వేసిన అనంతరం ఆక్టోపస్ మాక్ డ్రిల్ ఉ గ్రవాద నిరోధక వ్యాయామం నిర్వహించడానికి పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక, ఆరోగ్యశాఖల అధికారులు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, ఏఎస్పీలు రాజ శేఖర్ రాజు, నందకిషోర్, ఆక్టోపస్ డీఎస్పీ తిరుమలయ్యల ఆధ్వర్యంలో స్థానిక ఈఓ కార్యాలయం సమావేశ మందిరంలో ఆలయ భద్రతపై సమీక్ష నిర్వహించారు. ఉగ్రవాదుల నుండి ఏదైనా అనుకోని పరిస్థితులు ఎదురైతే చేపట్టవలసిన కార్యక్రమాలపై శుక్రవారం రాత్రి మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్లు తెలిపారు. చిత్తూరుడీఎస్పీసాయినాథ్,ఐరాల తహశీల్దార్ లోకేశ్వరి, ఈఈ వెంకట నారాయణ, ఏఈఓ రవీంద్రబాబు, ఏఈలుశివాంజనేయులు,పవన్,కాణిపాకంఎస్సై నరసింహులు, ఆక్టోపస్ అధికారుల బృందం పాల్గొన్నారు.



# యువతకు పట్టం కడుతున్న పవన్ కళ్యాణ్

తొట్టంబేడు,సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: జనసేన నాయకుడు పవన్‌కళ్యాణ్ పార్టీ కోసం పని చేసిన వారికి పార్టీ కోసం వైకాపా పాలనలో ఇబ్బంది పడిన వారి సేవలను గుర్తించి నామినేటెడ్ పదవుల సందర్భంగా అవకాశం కల్పిస్తున్నారని దళిత నేత పులి శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మొదటి నుంచి పవన్ కళ్యాణ్ యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపు నిచ్చి యువతను క్రమశిక్షణలో నడిపిస్తూ యువతకు నేనున్నానని భరోసా ఇచ్చిన ఆయన శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి పగ్గాలను యువ నాయకుడు కొట్టే సాయికి ఇవ్వటం ఆయన క్రమబద్ధతకు నిదర్శనం అన్నారు.

# ముచ్చివోలులో రక్తదానం



శ్రీకాళహస్తిరూరల్,సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: మండలం ముచ్చివోలు గ్రామంలో భారత ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన సందర్భంగా శుక్రవారం బిజెపి నాయకులు, కార్యకర్తలు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అలాగేగ్రామంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాల్లో భాగంగా గ్రామంలో పారిశుద్ధ్యం కార్యక్రమాలను చేపట్టారు. రాష్ట్ర బిజెపి పార్టీ ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ పర్యవేక్షణలో మండల పార్టీ అధ్యక్షుడు భాగిర్తి వెంకటేష్ బూత్ అధ్యక్షుడు రాఘవులునాయుడు, పత్తి విజయకుమార్, సుబ్బు, చరణ్,కోగిల పెంచులయ్య, ఆటో రాజా గ్రామస్తుల సారధ్యంలో కార్యక్రమాలు జరిగాయి.

# పరశురామేశ్వరునికి వెండి పాదాల బహూకరణ



శ్రీకాళహస్తిరూరల్,సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: ఏర్పేడు మండలంలోని ప్రముఖ శైవాలయం అనందవల్లి సమేత పరశురామేశ్వరాలయానికి భక్తుల నుంచి కానుకలు సమర్పించారు. శుక్రవారం రిటైర్డ్ అధికారి కే.నాగరాజు కుటుంబ సభ్యులతో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందరనంగా వారు అమ్మవారికి 318 గ్రాముల వెండి పాదాలను అందించారు. వారికి ఆలయ మర్యాదలతో వేదపండితులచే ఆశీర్వదించారు.ఈ మేరకు మాజీ చైర్మెన్ బత్తలగిరినాయుడు,ఇఓ రామచంద్రారెడ్డిలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.వారికి వెండి పాదాలు అందించారు.

# ఏర్పేడు పాఠశాలలో క్రీడల పోటీలు



శ్రీకాళహస్తిరూరల్,సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: ఏర్పేడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి క్రీడల పోటీలను నిర్వహించారు.ఈ పోటీల్లో సుమారు 400 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునికుమారి అధ్యక్షతన ప్రారంభమైన పోటీలకు ముఖ్యఅతిధిగా మండల విద్యాశాఖాధికారి దయాకర్ ఏర్పేడు సర్పంచ్ శివ హాజరయ్యారు. ఉదయం నుంచి విద్యార్థులో పోటీ పడి విజయానికి కృషి చేసారు. ఈ విజేతల బహుమతుల ప్రధానోత్సవంలో రమేష్, భాను ప్రకాష్, పిఇటిలు మణి, జయచంద్ర, లోకేష్,వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, సోము,పుష్పవాణి,వాని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.శుక్రవారం 14,17 సంవత్సరాల లోపు బాలబాలికల వాలీబాల్,కబడ్డీ,ఖోఖో పోటీలు జరిగాయి.

# ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతి



తొట్టంబేడు,సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: బతుకు జీవనానికి కకూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న పాచి బత్తెయ్య శుక్రవారం యథాతథంగా తాళ్ళూరి మురళియాదవ్ పంటపొలాల్లో దున్నకానికి వెళ్ళారు. మండలంలోని పూడి గ్రామానికి చెందినరైతు పొలాల్లో అదే గ్రామానికి చెందిన దళిత వాడకు చెందిన బత్తెయ్య పొలం దున్నుతుండగా ప్రమాదవశాత్తు బల్తా పడినట్లు సమాచారం దాంతో ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తున్న బత్తెయ్య అక్కడిక్కడే చనిపోయాడు. తొట్టంబేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బలరాం తెలిపారు.మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఎర్రచందనం కేసులో 7 మందికి జైలు శిక్ష : డివైయస్‌పి

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: ఎర్రచందనం కేసులు ఏడుగురు నిందితు లకు ఎడిజె నరసింహామూర్తి మూడు సంవత్సరాలుజైలు శిక్ష ఒక్కొక్కరికి రూ.20వేలు జరిమాన విధిస్తూ తీర్పు చెప్పినట్లు శ్రీకాళహస్తి డివైయస్‌పి, సిఐతిమ్మయ్యలు శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో 2016లో ఎర్రచందనం అక్రమ రవాణాకు సంబంధించి ఏడుగురుపై ఎస్ఐ హేమంత్‌కుమార్‌రెడ్డి కేసు నమోదు చేసారు. ఈ కేసు కోర్టులో విచారణ జరిపారు. ఈ కేసులో నిందితులుగా కారణి మిట్టకు చెందిన సమ్మిటి పెద్ద గురవయ్య,కారణి రామయ్య, ఇడ్లి మోహన్,వెంకటయ్య, చెరివి శ్రీనివాసులు,రమణయ్య,మునిరత్నంలపై కేసు నమోద చేసారు.ఈ కేసులో విచారణ స్పీడ్‌గా నిర్వహించటంలో శ్రీకాళహస్తి డివైయస్‌పి నరసింహ్ మూర్తి, బుచ్చినాయుడు కండ్రిగ సిఐ తిమ్మయ్య,ఎస్ఐ విశ్వనాధనాయుడు ఏఎస్ఐ నారాయణ మూర్తిలు సహాకరించారు. కేసును సమర్ధవంతంగా నిర్వహించిన సిబ్బందికి తిరుపతిజిల్లా ఎస్‌పి సుబ్బరాయుడు అభినందించారు.

# ఆయుర్వేదంపై అవగాహన కార్యక్రమం



తిరుపతి విద్య, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: జాతీయ సంస్కృత వర్సిటీలో ప్రధానమంత్రి మోదీ జన్మదిన సందర్భంగా సేవాసప్తాహ కార్యక్రమంలో భాగంగా ఆయుర్వేదంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగినది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొ.జి.యస్.ఆర్ కృష్ణమూర్తి విచ్చేసి సేవనే పరమావధిగా భావిస్తూ ప్రతి విద్యార్థి ముందుకు సాగాలని ప్రతి ఒక్కరూ కూడా ఆరోగ్య విషయంలో అత్యంత జాగ్రత్తలు తీసుకుంటూ, భావి భారతాన్ని నిర్మించేటువంటి గురుతర బాధ్యతను మీరందరు తీసుకుంటూ ముందుకు సాగాలని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం ఎస్.వి ఆయుర్వేద కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ డా.ఎన్ కృష్ణయ్య మాట్లాడుతూ ఆయుర్వేదం అనేటువంటిది మానవుని యొక్క జీవన విధానాన్ని అత్యంత శక్తివంతంగా మార్చేటువంటి ప్రక్రియ అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డా.తపన్ కుమార్ గడై, డా.డి.జ్యోతి,ఎ.పి.ఆర్.ఓ. డా.కనపాల కుమార్, యోగ విభాగం, సాంఖ్య విభాగం విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు.

# మల్లంగుంట గ్రామ పంచాయతీలో చెత్త సేకరణకు బ్యాటరీ ఆటోలు



తిరుపతిరూరల్,సెప్టెంబర్19 ప్రభాతవార్త: తిరుపతి రూరల్ మల్లంగుంట గ్రామ పంచాయతీలో చెత్త సేకరణకు జడ్పి సిఇఒ, మండల అధికారులు ఎలక్ట్రికలల్ ఆటోలను అందజేసారు. ఈ మేరకు శుక్రవారం మల్లంగుంట గ్రామ పంచా యతీలో 3 ఎలక్ట్రికల్ ఆటోలను సిఇఒ రవికుమార్ నాయుడు ప్రారంభించారు. చెత్త సేకరణ చేసే వాహానాలకు ఎలాంటి ఇంధన ఖర్చు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎలక్ట్రికల్ (ఈవిఎం) ఆటోలను అందుబాటులోకి తెచ్చినట్లు సమాచారం.డిఎల్‌పిఓ సురేష్‌నాయుడు, డిప్యూటీ ఎంపిడిఓ దయాసాగర్, ఇన్‌చార్జి పంచాయతీ కార్యధర్శి లక్ష్మీదేవి, టిడిపి నాయకులు మునికృష్ణారెడ్డి, పొట్టేలి మునస్వామి, అవిలాల దిలీప్ యాదవ్, సర్పంచ్ భర్త రామచంద్ర, స్థానికులు పాల్గొన్నారు.



# భద్రతతో కూడిన

రహదారి నిబంధనలు తెలుసుకోవాలి

-పాఠశాల విద్యార్థులకు హోండామోటార్‌సైకిల్ అవగాహన

తిరుపతి,సెప్టెంబర్19ప్రభాతవార్త: చిన్నవయస్సు నుండే రహదారి నిబంధనలు తెలుసుకోవాలని, భద్రతతో కూడిన నియమాలతో సురక్షిత ప్రయాణం చేయవచ్చని హోండా మోటార్‌సైకిల్ యాజమాన్యం తెలిపింది. ఈ సంస్థ రోడ్డుభద్రత అవగాహన ప్రచారాన్ని తిరుపతికి తీసుకువచ్చింది.పలు పాఠశాల విద్యార్థులు 2,400మందికిపైగా పాల్గొని క్రమబద్ధమైన, శిక్షణ, ఇంటరాక్టివ్ లెర్నింగ్ నిర్వహించారు. భవిష్యత్ వాహానాల నడిపేవాళ్ళు విద్యార్థులు, చిన్నారులేనని తెలిపారు. హెల్మెట్ ధారణ, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, పాదచారుల నియమాలు, వాహనదారుల నియమాలు వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఇలాంటి ప్రచారాల ద్వారా రోడ్డునిబంధనలు అవగాహన కల్పించినట్లువుతుందని తెలిపారు. తరచూ ఇలాంటి అవగాహనతో రహదారి నియమాలు, జాగ్రత్తలు తెలుసుకునేందుకు దోహదపడుతుంది.

# శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో విశేష పూజలు



కల్లూరు, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త పులిచెర్ల మండలం దేవళం పేట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివారికి, అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అర్చనలు పూజలు జరిపి నైవేద్యం సమర్పించి మహా మంగళ హారతి గావించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ ప్రధాన అర్చకులు అనంత కుమారాచార్యులు పూజా కార్యక్రమాలునిర్వహించారు.పెద్దఎత్తునభక్తులుస్వామివారిని దర్శించుకున్నారు.

# పిల్లల్లో స్థూల కాయం నివారణకు చక్కెర, నూనె తగ్గించాలి

కల్లూరు, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త పిల్లల్లోస్థూలకాయంనివారణకుచక్కెర నూనె వాడకం తగ్గించాలని పులిచెర్ల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ వాణిశ్రీదేవి అన్నారు. పులిచెర్ల మండలం కల్లూరు అంగనవాడి కేంద్రం 3, బాలి రెడ్డి గారి పల్లెలో శుక్రవారం ఎనిదోవ రాష్ట్రీయ పోషణ మాసం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న పిల్లలు శిశువులు బాలింతలు గర్భవతులు తీసుకోవలసిన పోషక ఆహారం వ్యాధుల నివారణలో తీసుకోవలసిన జాగ్రత్తలు చికిత్సలు మందులు వాడకం తదితర వాటిపై అవగాహన కల్పించారు. సూపర్వైజర్ విజయలక్ష్మి అంగనవాడి కార్యకర్తలు. శ్యామల, సింధు శ్రీ, రేఖ, రాధిక, మున్ని, తల్లులు పాల్గొన్నారు.

# శ్రీ మూలస్థాన ఎల్లమ్మకి గ్రామ పొంగళ్ళు



చంద్రగిరి, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: చంద్రగిరి గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారికి శుక్రవారం గ్రామ పొంగళ్ళు సమర్పించుకున్నట్లు పినపెద్ద విరూపాక్షి శంకర్‌రెడ్డి తెలిపారు. ఆకుతోటవీధి ప్రాంత మహిళలు సంప్రదాయ వస్త్రధారణలతో పండుగ వాతావరణంలో బ్యాండు బాజాలు, బాణాసంచా పేళుళ్ళ నడుమ పొంగళ్ళు మోసుకుని ఆలయానికి చేరుకున్నట్లు తెలిపారు. ఆలయ ఆవరణలో పొంగళ్ళను వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, మాజీ సర్పంచ్ కొత్తపాటి మునిరామిరెడ్డి, వార్డు సభ్యుడు కొత్తపాటికోటిరెడ్డి, ఆంగేరి చంద్రారెడ్డి, దామోదర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# స్వస్తినారి శ్వసక్తి పరివార్‌లో ఆరోగ్య శిబిరం



విజయపురం, సెప్టెంబరు 19 ప్రభాతవార్త: మండలంలోని విజయపురం దళితవాడలో స్వస్తినారి స్వశక్తి అభియాన్‌లో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరానికి జనరల్ మెడిసిన్ వైద్యులు కార్తికేయన్, స్త్రీల విభాగ నిపుణులు జరీనా, జనరల్ సర్జరీ నిపుణులు శ్రీనిథ్, చిన్న పిల్లల వైద్య నిపుణులు లోకేష్, దంత వైద్యనిపుణులు శాంతి, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు విష్ణుప్రియ, వనజలు వైద్యపరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 115 మంది వైద్య పరీక్షలు చేసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో రాజేంద్ర, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# వైద్యశాల మహిళా ఉద్యోగులకు వైద్య పరీక్షలు



తిరుపతి హెల్త్, సెప్టెంబరు 19 ప్రభాతవార్త : స్వస్తవారి శాసక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి ప్రభు, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రమీల పర్యవేక్షణలో సామాజిక వైద్య శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ కృష్ణకుమారి, టీమ్, వివిధ స్పెషలిస్టులు విభాగాలతో కలిసి ప్రసూతి వైద్యశాల ఆవరణలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యనారాయణ మూర్తి స్త్రీల ఆరోగ్య ఆవశ్యకతను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ వి కృష్ణ కుమార్, ఇతర టీమ్ డాక్టర్ హేమలత, డాక్టర్ శశికళ, కమ్యూనిటీ మెడిసిన్ సిబ్బంది పాల్గొన్నారు.

# కత్తులతో పొడుచుకుంటే పోలీసులు కేసులు కడతారా!

- ఇది పుత్తూరు పోలీసులు పనితీరు- బాధితురాలు జె. నీలమ్మ, వారి బంధువులు కన్నీరు మున్నీరు




తిరుపతి హెల్త్, సెప్టెంబరు 19 ప్రభాతవార్త : ఇరువర్గాలు కత్తులతో పొడుకుంటే ఏ వర్గానికి అయితే రక్తగాయాలు అవుతాయో అప్పుడు కేసులు పెడతామని పుత్తూరు పోలీసులు బాధితులు నీలమ్మ, వారి బంధువులకు చెప్పడం ఏమిటని అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితురాలు జె. నీలమ్మ, వారి బంధువులు మాట్లాడారు. నీలమ్మ మాట్లాడుతూ తిరుపతి జిల్లా పుత్తూరు మండలం, టౌన్ కెవిన్ రోడ్డు డోర్ నెం.17-185లోకాపురం ఉంటున్న లేట్ సుబ్రమణ్యం భార్య నీలమ్మ మాట్లాడుతూ తన భర్త ప్రమాదవశాత్తు 1999లో మృతి చెందడం జరిగిందన్నారు. ఆయన చనిపోయిన తర్వాత ఇన్సూరెన్స్ క్రింద దాదాపు రూ.5లక్షలు డబ్బులు, తన తన నాన్నద్వారా వచ్చిన స్థిరశరాస్తులను తన తమ్ముడు ప్రభుత్వ టీచర్ ఉద్యోగి పీటీగా పనిచేస్తున్న గుర్రప్పకు, తన తండ్రి బి. సుబ్రమణ్యంకు ఇవ్వడం జరిగిందన్నారు. అందుకు ప్రతిఫలంగా తనకు ఓ ఇల్లును తన తండ్రి రాసి ఇవ్వడం జరిగిందన్నారు. అయితే తన తండ్రి, టీచర్ తమ్ముడు కొంత మంది రౌడీలను తీసుకుని వచ్చి తాము ఇంట్లో ఉన్నప్పుడు నన్ను, నా కుమార్తెను కొట్టి ఇంట్లోని సామాన్లను బయటకు వేయడం జరిగిందన్నారు. దీనిపై పోలీసులకు వారిపై ఫిర్యాదు చేసి కేసులు కట్టాలని విజ్ఞప్తి చేస్తే పుత్తూరు సీఐ, ఎస్.ఐలు మీకి ఏమైనా గాయాలు అయ్యాయా... లేకుంటే కత్తులతో పొడిచిరా అని వ్యంగంగా మాట్లాడి బాధితులను బూతులు తిడుతూ సాయం చేయడానికి వచ్చిన బంధువులను సైతం పోలీసులు నానా రకాలుగా ఇబ్బందులు పెట్టడం దారుణమన్నారు. దీనిపై ఎస్పీ, కలెక్టర్ వెంటనే స్పందించి నిర్లక్ష్య సమాధానాలు చెబుతున్న పుత్తూరు సీఐ, ఎస్.ఐలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బాధితురాలితో వారి బంధువులు వరలక్ష్మి, పొట్టెమ్మ, సుబ్బమ్మ, నాగులు, జయశంకర్, తదితరులు పాల్గొన్నారు.

# రావి సుధాకర్ చౌదరి ప్రతిభకి పురస్కారం



తిరుపతి విద్య సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: నెల్లూరు జిల్లా ఈదూరు గ్రామానికి చెందిన రావి సుధాకర్ చౌదరి షుగర్ పరిశ్రమలో 55 సంవత్సరాల పాటు అందించిన విశిష్ట సేవలకు గాను ప్రతిష్టాత్మక అవార్డుతో సన్మానించబడ్డారు. శుక్రవారం తిరుపతి శ్రీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన సిస్ట 54వ వార్షిక సమావేశం సందర్భంగా ఈ సన్మానం నిర్వహించారు.అగ్రికల్చరల్ బీఎస్సీ,ఎమ్మెస్సీ పూర్తి చేసి,వివిధ షుగర్ ఫ్యాక్టరీలలో అనేక హోదాలలో పనిచేసి విశేష కృషి చేశారు. అనేకసార్లు కేంద్రమంత్రుల చేతుల మీదుగా జీవిత సాఫల్య పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు.పరిశ్రమ అభివృద్ధికి చేసిన కృషి ప్రశంసనీయమని నిర్వాహకులు పేర్కొన్నారు.

# జిల్లాస్థాయి ఎస్‌జిఎఫ్‌ఐ పోటీలకు ఎంపిక



తిరుపతి విద్య, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: మండల స్థాయి పోటీల్లో అండర్ 17 కబడ్డీ,కోకో విభాగంలో స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్డు నందు గల నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు పార్థసాయి,నవనీత్, హేమ తేజ, యుతేష్ జిల్లాస్థాయి ఎస్‌జిఎఫ్ఐ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను తిరుపతి నారాయణ విద్యాసంస్థల యాజమా న్యం డీజిఎం కొండలరావు,ఏజీఎం శ్రీనివాసులు,ఆర్ఐ వసంత్ కుమార్, ప్రిన్సిపాల్ షాహిద్ భాషా,ఉపాధ్యాయులు వీరిని అభినందించారు.

# యుగాంతంలో పరిస్థితులు ఊహాతీతం : హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 19 ప్రభాతవార్త : యుగాంతంలో సమాజంలో పరిస్థితులు ఊహాతీతంగా ఉంటాయని చిట్టచివరి ప్రవక్త మహమ్మద్ సొల్లె అలాసొల్లం వివరించారని హాఫీజేఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ అన్నారు.శుక్రవారం జామియా మస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల తరువాత మాట్లాడుతూ నేడు వాతావరణం పరిశీలిస్తే యుగాంత సూచికలు స్పష్టంగా ఉన్నాయన్నారు. మనిషి జీవితం ఇహలోకంలో శాశ్వతం కాదని 'మనం పుట్టింది భూమిపై శాశ్వతంగా ఉండటానికి కాదని చావటానికే పుట్టామనే' సత్యాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. మనం చేసే ప్రార్థనలు భక్తితో కూడుకున్నవి ఉండాలి తప్ప సమాజాన్ని మెప్పించటానికి ఉండకూడదన్నారు. మనం మోకరిల్లాల్సింది కేవలం ఒక్క అల్లాహ్‌కు మాత్రమే అని గుర్తించుకోవాలన్నారు. దేవుడు ఒక్కడే ఆతను సర్వాంతర్యామి అనే విషయాన్ని విస్మరించకూడదన్నారు. భక్తితో మోకరిల్లి శరణు జొచ్చితే మన తప్పుల్ని క్షమిస్తాడని వివరించారు.

# యూరియా కొరతను తీర్చి రైతుల్ని ఆదుకోండి



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: వ్యవసాయప్రధానమైన శ్రీకాళహస్తి నియోజకవర్గం లో రైతులకు విరివిగా నిబంధనలకు అతీతంగా యూరియాను అందించి ఆదుకోవాలని రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సిగం రామకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షులు బాలగురువం బాబు,శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి తలపా దామోదర్‌రెడ్డి డిమాండ్ చేసారు. శుక్రవారం వారు మాట్లాడుతూ యూరియా సరఫరాకు కాంప్లేక్సు ఎరువుల కొనుగోలు పేచీ పెడుతున్నారని సాక్షాత్తు శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి శాసనసభలో పేర్కొన్నారని వివరించారు. వారితోపాటు పిసిసి ప్రధానకార్యదర్శి తమటం వెంకట సరసింహులు, జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడుజనార్ధన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కలిందర్, ఓబిసి సెల్ జిల్లా అధ్యక్షులు బాలరాజు ఎస్‌టిసెల్ జిల్లా అధ్యక్షులు బాబు,ఎస్‌టి సెల్ జిల్లా అధ్యక్షుడు జ్యోతిశ్వర్ నాయక్,జిల్లా ఉపాధ్యక్షులు దేవదానం, మైనారిటి సెల్ జిల్లా అధ్యక్షుడు ఫయాజ్, శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, తడమండల అధ్యక్షులు భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

# శివయ్య సేవలో తెలంగాణ మినిస్టీరియల్ ఆఫీసర్



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం తెలంగాణకు చెందిన చిన్న కేసుల కోర్టు చీఫ్ మినిస్టీరియల్ ఆఫీసర్ కుటుంబ సభ్యులతో పూజలు చేయించుకున్నారు. వారికి సిపిఐ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జనమాల గురవయ్య ఘనస్వాగతం ఏర్పాటు చేసారు. వారికి స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. తరువాత మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. గురవయ్యతో పాటు ఏఐటియుసి నాయకుడు మురళి పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## న్యూమారుతీ నగర్‌లో స్మశానస్థలం ఆక్రమణకు యత్నం

-అడ్డుకున్న స్థానికులు, కూటమిని నాయకులు



తిరుపతిరూరల్,సెప్టెంబర్19 ప్రభాతవార్త: ముత్యాలరెడ్డిపల్లి పరిధిలోని న్యూ మారుతీ నగర్‌లో స్మశాన స్థలంలో ఓ మహిళ రేఖుల షెడ్డు నిర్మాణాలకు పునాదులు తీయగా స్థానిక కూటమి నాయకులు అడ్డుకున్నారు. స్మశాన స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపబడితే ఊరుకోబోమని, నిర్మాణాలు చేసే అధికారం మీకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. డిప్యూటీ తహశీల్దార్ తన భర్తకు పట్టా ఇచ్చారని ఆమె తెలపగా, పట్టా పత్రాలు చూపాలని కూటమి నాయకులు కోరగా, కూటమి నాయకులపై ఆ వృద్ధ మహిళ ఎదురుదాడికి దిగింది. ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కూటమిని జనసేన నాయకులు ఉదయ్, మౌళి, ఓబుల్‌రెడ్డి, రంగారెడ్డి, టిడిపి నాయకులు కొట్టే హేమంత్‌రాయల్, సద్దా బాబు స్థానికులు పాల్గొన్నారు.

## 'మన డబ్బులు-మన లెక్కలు'పై అవగాహన

-యాప్ ద్వారా సంఘం లెక్కలకు భద్రత

-డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్‌బాబు




తిరుపతిరూరల్,సెప్టెంబర్19 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలంలోని మహిళా సమాఖ్యలకు 'మన డబ్బులు-మన లెక్కలు'పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల పరిధిలోని చెర్లోపల్లి, వెంకటపతినగర్, పేరూరు గ్రామ పంచాయతీలలోని మహిళలకు అవగాహన కల్పించారు. వెలుగు జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్‌బాబు మాట్లాడుతూ మన డబ్బులు-మన లెక్కలు యాప్ ద్వారా ప్రతి సంఘ సభ్యులు పొదుపులు, తీసుకున్న ఋణాలు, ఇప్పటిదాక చెల్లించిన ఋణాలు, చెల్లించాల్సిన ఋణ వివరాలను ప్రతి సంఘ సభ్యురాలు తెలుసుకోవచ్చునని తెలిపారు. సంఘ సభ్యుల లెక్కల్లో ఏదైనా తప్పులు ఉంటే గ్రీవెన్స్ రైజ్ చేసి సమస్యను పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఎంఐబి వెంకటేష్, ఏపిఎం పత్తిపాటి నాగేశ్వరరావు, వెంకటపతినగర్ టిడిపి అధ్యక్షుడు ఉసిరిపాటి శ్రీనివాసులు, సిసిలు, సిఆర్‌సిలు, మహిళలు పాల్గొన్నారు.

## దస్తావేజు లేఖరుల నిరసన




పుత్తూరు రూరల్, సెప్టెంబరు 19 ప్రభాతవార్త: ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్డు ప్రైమ్ 2.0 రద్దు చేసి పాత పద్ధతినే కొనసాగించాలని దస్తావేజు లేఖరులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ వారి కార్యాలయం వద్ద ప్రభుత్వం నూతనంగా 2.0 సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ పెన్‌డౌన్ చేసి నిరసన వ్యక్తం చేశారు. నూతన విధానాలతో తమ పొట్ట కొట్టవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో అసౌకర్యం కలిగిస్తున్నారని విమర్శించారు. ఆధార్ ఓటీపీ, స్థానిక సంస్థల డేటాబేస్ ఆధారంగా ఇంటి ఆస్తుల రిజిస్ట్రేషన్లు, రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధిత కార్డు ప్రైమ్ సాఫ్ట్‌లోని సాంకేతిక లోపాల వలన దస్తావేజుల తయారీ ఇబ్బందికరంగా మారుతోందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక దస్తావేజు లేఖరులు, స్టాంపు వెండార్లు, డీటీపీ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగానికి వెలుగులు పంచిన...ఉదార హస్తం



సత్యవేడు, సెప్టెంబరు 19 ప్రభాతవార్త: పరిశ్రమల కాంతి మాలికగా వెలుగొందు తున్న తిరుపతి జిల్లా సత్యవేడు మండలం శ్రీసిటీలో రాక్‌వర్త్ సిస్టమ్స్ ఫర్నిచర్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ 14వ వార్షికోత్సవ వేడుకలు ఆహ్లాద భరిత వాతావరణంలో అల్లుకుపోయాయి. తన తల్లిగారి స్మృతిలో స్థాపించిన మీనాదేవి మెమోరియల్ ఫౌండేషన్ ద్వారా కంపెనీ యజమాని శైలేష్‌కుమార్ సింగ్ విద్యార్థుల భవిష్యత్‌కి వెలుగులు నింపే దిశగా ముందడుగు వేశారు. మొత్తం రూ.30 లక్షల విలువైన విద్యా ఫీజు రసీదులు పంపిణీ చేసి రాక్‌వర్త్ ఉద్యోగుల పిల్లల్లో 40 మందికి, బయటి విద్యార్థుల్లో 25 మందికి విద్యా దీపాలు వెలిగించారు. ఆశతో ఎదురు చూస్తున్న 65 మంది విద్యార్థుల కన్నులలో వెలుగులు నింపిన ఈ సహాయం రాబోయే కాలంలో వంద మంది జీవితాలను తాకాలని ఆయన సంకల్పం వ్యక్తం చేశారు.

## పుత్తూరులో ఎస్‌టీఎఫ్ అథ్లెటిక్స్ పోటీలు



పుత్తూరు రూరల్, సెప్టెంబరు 19 ప్రభాతవార్త: పుత్తూరు ఎస్ఆర్ఎస్ కళాశాలలో ఎస్‌టీఎఫ్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పుత్తూరు డీవైఈవో ఉమామహేశ్వరరావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని, విద్యార్థులు, క్రీడా స్ఫూర్తితో ఆడాలని చదువుతో పాటు క్రీడలను రాణించాలని ఆయన కోరారు. ఎంపికైన విద్యార్థులు డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పుత్తూరు ఎంఈవో తిరుమలరాజు, హెచ్ఎం ప్రభాకర్‌రాజు, మండల కో-ఆర్డినేటర్ గోపికృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు జయప్రకాష్, కేశవులు, సుబ్రహ్మణ్యం, గుర్రప్ప, మోహన్, ఆర్ముగం, శంషుద్దీన్, రాజశేఖర్ పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లకు నెలకు పదివేలు ఇవ్వాలి!



రేణిగుంట, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రతి ఆటో డ్రైవర్ కు నెలకు పదివేల రూపాయలు ఇవ్వాలని బిఎంఎస్ (భారతీయ మజ్దూర్ సంఘ్) నాయకుడు వెంకటాద్రి యాదవ్ శుక్రవారం డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు పదుల సంఖ్యలో ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని ఈ సందర్భంగా ప్రభుత్వానికి గుర్తు చేశారు. లేనిపక్షంలో రాష్ట్రంలోని ఆటో డ్రైవర్ల అందరిని బిఎంఎస్ ద్వారా సంఘటిత పరిచి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## ఆహార భద్రత విభాగం సిబ్బంది ఆకస్మిక తనిఖీలు



తిరుపతి రవాణా, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త : తిరుపతి ఆహార భద్రత విభాగం సిబ్బంది పై అధికారుల ఆదేశాల మేరకు జగదీష్ మరియు మద్దిలేటి తిరుపతి రైల్వే స్టేషన్ నందు మరియు బస్టాండ్ నందు ఆకస్మిక తనిఖీలు నిర్వహించను రానున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా వచ్చు ప్రజలకు భక్తులకు సరైన ఆహారం అందించాల్సిందిగా సుచీ సుబ్రతా కచ్చితంగా పాటించాలని తెలుపుతూ ఎటువంటి కల్తీ ఆహారము ప్రజలకు అందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించడం అయినది ప్రజల యొక్క ఆరోగ్యం పట్ల వ్యాపారస్తులు జాగ్రత్త వహించవలసినదిగా నియమ నిబంధనలు పాటిస్తూ వ్యాపారము నిర్వహించుకోవాలని తెలపడం అయినది అతిక్రమించినచో కఠిన చర్యలు చేపట్టబడతాయని హెచ్చరించడమైనది

## శ్రీశైలం మల్లన్న సేవలో బిజెపి నాయకులు



తిరుపతి రవాణా సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: శ్రీశైలం మల్లికార్జున స్వామి వారిని బిజెపి సీనియర్ నాయకులు గుండాల గోపీనాథ్ రెడ్డి కుటుంబ సమేతంగా శ్రీశైలం ఆలయ చైర్మన్‌గా నియమితులైన పోతుగుంట రమేష్ నాయుడు ని కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నూతన చైర్మన్ తో కలిసి స్వామివారి అభిషేకం సేవలో పాల్గొన్నారు.

## డాక్యుమెంట్ రైటర్లు పెన్ డౌన్




చంద్రగిరి, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: డాక్యుమెంట్ రైటర్లు శాంతి యుతంగా చేపట్టిన పెన్ డౌన్ కార్యక్రమంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు స్థంభించాయి. శుక్రవారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన డాక్యుమెంట్ రైటర్లు తమ సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. స్టీరింగ్ కమిటీ సభ్యుడు సి.ఎం.కేశవులు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖలో విధానపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. దీంతో డాక్యుమెంట్‌ర్లకు ఏర్పడుతున్న జాప్యం కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు సిబ్బంది పాల్గొన్నారు.

# సామాజిక కార్యక్రమాల్లో యువఇంజనీర్లు భాగస్వామ్యం

**- ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి**



కోట, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: సామాజిక కార్యక్రమాల్లో యువ ఇంజనీర్లు భాగస్వాములు కావాలని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి డైరెక్టర్ డాక్టర్ వి.విజయ కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికె ఆర్ ఐఎస్‌టిలో జ్ఞాసస్ జాతీయ స్థాయి సామాజిక సదస్సు నిర్వహించారు. ముందుగా విజయకుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మహిళా సాధికారత, వ్యవసాయ రంగంలో స్మార్ట్ టెక్నాలజీ, ఈ-లెర్నింగ్, గుడ్ గవర్నెన్స్, ఫిజికల్ ఫిట్‌నెస్, పోస్టర్ ప్రజంటేషన్ వంటి కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సాంకేతిక నైపుణ్యాన్ని బృంద చర్చల్లో చర్చించుకోవాలని కోరారు. ఈ



కార్యక్రమంలో డాక్టర్ జి.హరినాథరెడ్డి, ఎం.శివప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఎన్‌సిసి విద్యార్థులు ఎంపిక:**

విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో శుక్రవారం ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులు ఎన్‌సిసి కోర్సులో చేరడానికి ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ మూడేళ్ల పాటు ఎన్‌సిసిలో చేరిన విద్యార్థులకు ఆర్మీ శిక్షణ, క్రమశిక్షణ, రైఫిల్ ఫైరింగ్, నాయకత్వ లక్షణాలు, సమాజం పట్ల ఎలా నడుచుకోవాలి వంటి అంశాలు నేర్పిస్తారని తెలిపారు. ఎన్‌సిసి-సి సర్టిఫికెట్ ద్వారా ఆర్మీ, పోలీసు విభాగాల్లో చేరడానికి ప్రత్యేక రిజర్వేషన్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అరుణ్‌కుమార్, ఎన్‌సిసి ఆఫీసర్ గోవిందు మాధవయ్య, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

## కూలీలలందరికి ఉపాధి పనులు కల్పించాలి



డక్కిలి, సెప్టెంబరు 19 ప్రభాతవార్త: డక్కిలి మండలంలో జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీవో రవీంద్రబాబు తెలిపారు. సంగనపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడుతూ ఉపాధి పనుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మార్పులు తీసుకొచ్చిందని చెప్పారు. ఇందులో భాగంగా పనులకు వచ్చే కూలీలు పని ప్రదేశంలోనే ఫోటోను ఫీల్డ్‌అసిస్టెంట్ తీస్తారని తెలిపారు. ఫోటోలు కూడా రెండు దఫాలు తీయడం జరుగుతందని వివరించారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ నరసింహులు, ఉపాధి హామీ పథకం ఏపీవో కుమారస్వామి, పంచాయితీ కార్యదర్శి రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

## షార్‌లో గురుపూజోత్సవం



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: సతీష్‌ధవన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోటలో శుక్రవారం గురు పూజోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. షార్‌లోని ఎంఆర్ కురుప్పు ఆడిటోరియంలో గురు పూజోత్సవంపై ప్రత్యేక ఉప న్యాసాలు ఏర్పాటు చేశారు. ఎంజిఆర్ వైద్య విశ్వవిద్యాలయ మాజీ వైస్‌ఛాన్సులర్ శుభాశేషన్ ముఖ్య అతిథిగా పాల్గొని గురుపూజోత్సవ విశిష్టతను వివరించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం స్పేస్ సెంట్రల్ స్కూలు, కేజీ స్కూలుకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయుకు మెమొంటోలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో షార్ డైరెక్టర్ పద్మకుమార్, కంట్రోలర్ రమేష్‌బాబు, అసోసియేట్ డైరెక్టర్ ముత్తుచెరియన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ




సూళ్లూరుపేట, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త : పట్టణంలోని నవజీవన్ ఆర్గనైజేషన్ సిసిపియు ఆధ్వర్యంలో రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ నేతృత్వంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం సహకారంతో ఇంటినిసిఫైడ్ క్యాంపెయిన్‌లో భాగంగా స్థానిక శ్రీసత్యం జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ కె.బాలాజీ, సత్యం కళాశాల ప్రిన్సిపాల్ గిరిధర్‌రెడ్డి, ఓఆర్‌డబ్ల్యులు మంజుల, నందిని, ఎఎన్ఎంలు శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో స్వచ్ఛతాహి సేవ



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: మున్సి పాలిటీలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గాంధీజీ జయంతి సందర్భంగా ఈ నెల 18వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కె.చిన్నయ్య తెలిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకూడదని ఆయన ప్రజలను కోరారు. ఈ సందర్భంగా భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్, వనంతోపు పాఠశాలల్లో విద్యార్థులచే స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## మత్స్యకారులకు అవగాహన సదస్సు



కోట, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త : మండలంలోని గోవిందపల్లిపాలెం గ్రామంలో శుక్రవారం తహశీల్దార్ కె.జయజయరావు, మెరైన్ సీఐ వెంకటేశ్వర్లురెడ్డి, ఎంపిడిఓ దిలీప్‌కుమార్, ఎఫ్‌డిఓ రెడ్డి నాయక్, ఎస్ఐ పవన్‌కుమార్, మెరైన్ ఎస్ఐ శివసొమ్యులు మత్స్యకారులకు అవగాహ సదస్సు నిర్వహించారు. వేటకు వెళ్లే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఉంటాయి, వాటిని వివిధ శాఖల అధికారుల దృష్టికి తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమం కమ్యూనిటీ అవేర్‌నెస్ ప్రోగ్రాం కింద మెరైన్ పోలీసులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు పాల్గొన్నారు.

## సిజీహెచ్‌ఎస్ ఏర్పాటు కోసం ఫలించిన ఎంపీ కృషి



వెంకటగిరి, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం సిజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్‌లు ప్రారంభించేందుకు అవసరమైన సిబ్బంది నియామకాలు చేపట్టేందుకు నోటిఫికేషన్ జారీ చేసిందని ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి తెలిపారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి గత పార్లమెంటు సమావేశాలలో సిజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్ అందుబాటులో లేక కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు ఆరోగ్య సేవలు పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేంద్రం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. నేడు అందుకు అవసరమైన సిబ్బంది నియామకాలు చేపట్టేందుకు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది.

## పెన్డౌన్ చేపట్టిన దస్తా లేఖకులు

వెంకటగిరి, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన కొన్ని విధానాల వలన ఇబ్బందులు పడుతున్నామని దస్తా లేఖకులు పెన్డౌన్ చేపట్టారు. ఈ నెల 20 తేదీ కూడా పెన్ డౌన్ చేస్తున్నట్లు తెలిపారు. సబ్ రిజిస్టర్ భాషకు డిమాండ్ల వినతిపత్రాన్ని దస్తా లేఖకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎం సురేష్, సాయి, చక్రి, శ్రీనివాసులు, శివ తదితరులు పాల్గొన్నారు.

## మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభించిన కమాండెంట్



వెంకటగిరి, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: స్థానిక తొమ్మిదో ప్రత్యేక పోలీసు పెట్టాలయంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను కమాండెంట్ ఈఎస్ సాయి ప్రసాద్ ప్రారంభించారు. మాతృ దేవీ విశ్వశాంతి ఆశ్రమ ట్రస్ట్ పెనుసుల క్షేత్రం శ్రీశ్రీశ్రీ విజయేశ్వరీ దేవి అమ్మవారి ఆశీస్సులతో 9వ బెటాలియన్ నందు అమ్మ శ్రీ కరుణామయి మినరల్ వాటర్ ప్లాంట్‌ను మరమ్మతుల అనంతరం తిరిగి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ ఆనంద్ కన్నా, రామకృష్ణ, విజయ్, ఆనంద్, ఆర్ఐలు బి.శివయ్య, జెఎన్‌వి సత్యనారాయణ, జి లక్ష్మయ్య బి సుబ్బారావు, గోవిందరాజులు, గోవిందరావు, జాలయ్య ఆర్ఎస్ఐలు అశోక్, తులసీరామ్, సురేష్‌లు పాల్గొన్నారు.

## ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి : సిడిపిఓ



వెంకటగిరి, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త : చిన్నతనం నుండి ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిడిపిఓ శంషాద్ బేగం తెలిపారు. స్థానిక బంగారుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారి సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలతో సమావేశం నిర్వహించారు. గర్భవతులు బాలింతలకు పౌష్టికాహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## గొర్రెల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి



వెంకటగిరి, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: వర్షాకాలంలో మేకలు గొర్రెల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని పసుపు సమర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీహరి రైతులకు సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు వర్షాకాలంలో మేకలు మరియు గొర్రెల పెంపకంలో చేపట్ట వలసిన యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో పలు రకాలు వ్యాధులు మేకలు గొర్రెలకు సోకతాయని తెలిపారు. వర్షాకాలం పూర్తయ్య వరకు తగు జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డా.క్రాంతి కిరణ్, డా.అశోక్, పాల్గొన్నారు. కే.వి.కే శాస్త్రవేత్తలు డా.నాగార్జునరెడ్డి, డా.విజయశ్రీ, శ్రీనివాస సేవాసంస్థ నుండి కేశవతోపాటు రైతు సోదరులు పాల్గొన్నారు.

## పూజలు నిర్వహించిన డిఎస్‌పి



వెంకటగిరి, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: గ్రామ శక్తి స్వరూపిణి పోలేరమ్మ ఆలయంలో డిఎస్‌పి గీత కుమారి పూజ నిర్వహించారు. జాతర నిర్వహణలో ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జాతర జరిగినందుకు శ్రీ పోలేరమ్మ అమ్మవారికి మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏడుకొండలు, గొల్లగుంట రాము, పుత్త శివప్రసాద్, తిరుపాల్ రెడ్డి, గొల్లగుంట చరణ్ పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

వెంకటగిరి, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: పట్టణంలోని ఎరుకల కాలనీకి చెందిన 15 సంవత్సరాల బాలికను గర్భవతి చేసి పెళ్లి చేసుకోను అని మోసం చేసిన నాగరాజు పై కేసు నమోదు చేసినట్లు ఏవి రమణ తెలిపారు. ఈ ఘటనపై గూడూరు డిఎస్పి గీత కుమారి విచారణ జరిపారు. బాలికకు బంధువైన నాగరాజు చీపురు కట్టలు అమ్ముకుంటూ జీవిస్తున్నాడు. బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతి చేశాడు. బాలికను పెళ్లి చేసుకోమని నాగరాజును బంధువులు కోరడంతో అతను నిరాకరించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నాగరాజ్‌పై కేసు నమోదు చేశారు. డి.ఎస్.పి జరిగిన సంఘటనపై విచారణ జరిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## క్రీడలో రానిస్తే బహుళ ప్రయోజనాలు




వాకాడు, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: విద్యార్థిని, విద్యార్థులు క్రీడల ద్వారా రాణిస్తే బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ఎంఈఓ ఆనందం తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడా ఎంపికలు క్రీడలు పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నసీం అలి, పాఠశాల ప్రధానోపాధ్యా యులు ప్రవీణ్ కుమార్, పిడి రాజ్‌కుమార్, పిఈటి శ్రీనివాసులు, సిఆర్‌పి బాబులు పాల్గొన్నారు.

## పశు సంపదతోనే గ్రామీణ అభివృద్ధి



వాకాడు, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: అనిమల్ క్రెడిట్ లివెల్లీహుడ్ ప్లాన్ అధారంగా చేసిన సర్వేలో భాగంగా ఎక్కువ మంది లైవ్ స్టాక్ సెలెక్ట్ చేసుకున్న డేటా అదారంగా ప్రభుత్వం చేసిన నిర్ణయం ప్రకారం పశు సంవర్ధక శాఖ, డిఆర్‌డిఏ సంయుక్త ఆధ్వర్యంలో వాకాడు మండలంలోని బాలిరెడ్డిపాలెం గ్రామంలో ఎస్‌హెచ్‌జి గ్రూప్‌లకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. బ్యాంకు లింకేజీ ద్వారా అర్హులైన అభ్యర్థులకు తమ జీవనోపాదిని మెరుగు పరచుటకు ప్రభుత్వం చేపడుతున్న ఈ స్కీంను మహిళలు ఉపయోగించు కోవాలని మండల పశు వైద్యులు డాక్టర్ సి హెచ్ సరే కృష్ణ రావు అవగాహన సదస్సులో మాట్లాడటం జరిగింది. ఈ నెల 25 తేదీ వరకు మండలంలో ఎంపిక అయిన మహిళలకు అవగాహన సదస్సులు పూర్తి చేసి తర్వాత ఆ తర్వాత నుండి అనిమల్ పర్చేసింగ్ చేసే కార్యక్రమంలో డిఆర్‌డిఏ సిబ్బందితో పాటు తాము పాల్గొంటామని తెలియచేశారు. ఈ అవగాహన సదస్సులో డిఆర్‌డిఏ శాఖ నుండి సీసీ,విఓ,పశు సంవర్ధకశాఖ నుండి అనిమల్ హస్బెండ్రి అసిస్టెంట్‌లు పాల్గొన్నారని తెలియచేశారు.

## మత్తు పదార్థాలపై అవగాహన

గూడూరు, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: పట్టణంలోని కళాశాలలో చదువుకునే విద్యార్థులు మత్తు పదార్ధాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని గూడూరు రెండో పట్టణ ఎస్సై సుబ్రమణ్య రాజు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం గూడూరు రెండో పట్టణ పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాల, ఎస్కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాల వాడకంపై జరిగే అనర్ధాలపై అవగాహన సదస్సును రెండో పట్టణ పోలీసులు నిర్వహించారు. రెండో పట్టణ ఎస్సై సుబ్రమణ్య రాజు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మత్తు పదార్థాల వాడకం నివారణ పై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై సూచించారు.

## ఛలో మెడికల్ కాలేజ్ కార్యక్రమం



గూడూరు, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ అధినేత వై యస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా ఛలో మెడికల్ కాలేజ్‌లో భాగంగా జోనల్ 4 స్టేట్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూమన అభినయ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మదనపల్లె మెడికల్ కాలేజ్ సందర్శన కార్యమానికి నెల్లూరు జిల్లా యూత్ ప్రెసిడెంట్ ఊటుకూరు నాగార్జున్‌తో కలిసి, వైసీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి కొండూరు సునీల్‌రెడ్డి, గూడూరు మండల ఎంపీపీ గురవయ్య, తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి తీర్థం పుచ్చుకున్న ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్



వెంకటగిరి, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన బల్లి కళ్యాణ్ చక్రవర్తి సీఎం నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. తాడేపల్లిలోని సీఎం చంద్రబాబు నాయుడు ఎమ్మెల్సీ కళ్యాణ్ చక్రవర్తికి టిడిపి కండువా చేసి పార్టీలోకి ఆహ్వానించారు. తెలుగుదేశం పార్టీ లో తన తండ్రి బల్లి దుర్గాప్రసాద్, తనకు మంచి గుర్తింపునిందని తెలిపారు. తెలుగుదేశం పార్టీలోకి తిరిగి రావడం ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్యేలు నెలవల విజయశ్రీ, పులివర్తి నాని, సునీల్ కుమార్, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ తదితరులు ఉన్నారు.

## ట్రబుల్ మాంగర్స్, రౌడీషీటర్లకు ప్రత్యేక కౌన్సిలింగ్



గూడూరు, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: ఎస్‌డిపిఓ ఆధ్వర్యంలో గూడూరు 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ట్రబుల్ మాంగర్స్ రౌడీషీటర్లకు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. గూడూరు పట్టణంలో జరగబోయే జండా పండుగ సందర్బంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మంచి ప్రవర్తనతో ఉండాలని సూచించారు. అంతే కాకుండా, ఎవరు అశాంతి కలిగించే ప్రయత్నం చేసినా, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## ఈ నెల 22 నుంచి కోటలో దసరా శరన్నరాత్రి ఉత్సవాలు



కోట, సెప్టెంబరు 19 ప్రభాతవార్త : ఈనెల 22 వతేదీ నుంచి అక్టోబరు 2 వరకు కోటలోని శ్రీకోటమ్మ ఆలయం ప్రాంగణంలో అమ్మవారి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి చెప్పారు. ఆమేరకు శుక్రవారం కోటమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలకు సంబందించి పోస్టరును ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాల సందర్భంగా రోజుకో అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో శిరిడిసాయి సేవా సమతి చైర్మెన్, అల్లం రమణయ్య, ఆవుల సుబ్బయ్య, బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ లేజర్ రన్‌కు ఎంపికైన సాయి భార్గవ్



చిత్తూరుహెల్త్, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: జాతీయ స్థాయిలో పతకం సాధించి అంతర్జాతీయ స్థాయిలో అండర్-17 లేజర్ రన్ పోటీలకు ఎంపికైన సాయి భార్గవ్ మాజీ టౌన్ బ్యాంకు చైర్మన్ షణ్ముగం, కోచ్ కె.కృష్ణతో కలిసి శుక్రవారం విజయవాడలో పలువురు మంత్రులను కలిశారు. రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, శాప్ చైర్మన్ రవినాయుడు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడులను సాయి భార్గవ్ మర్యాదపూర్వకంగా కలిసి తాను సాధించిన పతకంను ప్రదర్శించాడు. ఈ సందర్బంగా సాయి భార్గవ్‌ను మంత్రులు సన్మానించి అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొనడానికి దక్షిణాఫ్రికా వెళ్తున్న క్రీడాకారుడు సాయి భార్గవ్‌కు ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందిస్తామని శాప్ చైర్మన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్‌బాల్ అధ్యక్షుడు పిఎస్ చందు, కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నమాచార్యలో విజయవంతంగా స్మార్ట్ ఇండియా హ్యాక్ థాన్



రేణిగుంట, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ శ్రీ అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 15వ తేదీ నుండి స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2025 విజయవంతంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమం సెప్టెంబర్ 20వ తేదీ వరకు జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదముని రెడ్డి శుక్రవారం తెలియజేశారు. విద్యార్థులు 75 బృందాలుగా ఏర్పడి స్మార్ట్ ఇండియా లో భాగంగా అనేక రూపకాలను ఆవిష్కరించినట్లు తెలిపారు. వీటిని ఆగస్టు 25వ తేదీ భారత విద్యా మంత్రిత్వ శాఖ నిర్దేశించిన విధంగా వివిధ కళాశాలలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియను భారత విద్యా మంత్రిత్వ శాఖకు వివరించినట్లు తెలిపారు. నవంబర్ డిసెంబర్ నెలలో దేశవ్యాప్తంగా జరిగే పోటీల్లో నమూనాల ప్రదర్శన నిర్వహిస్తారని అన్నారు. నమూనాల ఆవిష్కరణకు కళాశాల అధ్యాపకులు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. ఇన్స్టిట్యూట్ ఇన్నోవేషన్ సెల్ (ఐఐసీ) జ్యూరీ ద్వారా పరీక్షించి ఎంపిక చేస్తామన్నారు. స్మార్ట్ ఇరిగేషన్, స్మార్ట్ ఎడ్యుకేషన్, స్మార్ట్ క్లాస్ రూమ్ టైం టేబుల్ షెడ్యూల్, స్మార్ట్ క్రాప్ అడ్వైజరీ సిస్టం ఫర్ స్మాల్ మార్జినల్ ఫార్మర్స్, రియల్ లైఫ్ సొల్యూషన్ ఫర్ వేస్ట్ మేనేజ్మెంట్, మెచ్చుకోదగిన పరిశోధనలను ఐసీసీ టీం డాక్టర్ గురు జవహర్, దిలీప్ కుమార్, హెచ్ఓడీలు ప్రకటించినట్లు తెలిపారు.

## ఆరులేన్ల పనుల ప్రతిపాదన విరమించుకోవాలి

**- ఆర్‌డిఓ కార్యాలయం వద్ద ధర్నా**



తొట్టంబేడు, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: చెన్నై- నాయుడుపేట ఆరులేన్ల పనుల ప్రతిపాదనలను విరమించుకొని రైతుల భూములకు రక్షణ కల్పించాలని కోరుతూ శుక్రవారం శ్రీకాళహస్తి ఆర్‌డిఓ కార్యాలయం వద్ద రైతులు ధర్నా చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెన్నై-నాయుడుపేటలను కలుపుతూ తడ నుంచి వరదయ్యపాళెం, బుచ్చినాయుడు కండ్రిగ, తొట్టంబేడుల మీదుగా బసవయ్యపాళెం వద్దకు ఆరులేన్ల రోడ్ల నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు వివరించారు. ఇందుకు మార్కింగ్‌కూడా ఇచ్చినట్లు వివరించారు. అయితేఈ ప్రతిపాదనను ప్రభుత్వం అధికారులు పునరాలోచించుకోవాలని కోరారు. శ్రీకాళహస్తికి సమీపంలో అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ఆరులేన్ల రోడ్ల నిర్మాణంతో తీరని నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు 'ఊరులోపల ఆరులేన్ల రోడ్లు వద్దు-ఊరుబయట ముద్దు' అంటూ నినాదాలు చేసారు. గతంలో చెన్నై-నాయుడుపేట రోడ్లను కలుపుతూ 4లేన్ల రోడ్లు వేసారని బసవయ్య పాళెం కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పూర్తి చేయాలంటూ డిమాండ్ చేస్తూ ఆర్‌డిఓ కార్యాలయంలో ఏఓ శాంతికి వినతి పత్రం అందించినట్లు బాధితులు వివరించారు. ప్రస్తుత ప్రతిపాదనతో వందలాది మంది తీవ్రంగా నష్టపోతామని వివరించారు. ఇదే విషయం బాధితులం స్థానిక శాసన సభ్యునికి, జిల్లా కలెక్టర్‌కు, తుడా ఛైర్మెన్‌కు విన్నవించామన్నారు. అభివృద్ధి చెందిన ప్రాంతంలో ఆరులేన్ల రోడ్డు అవసరమా? అని ప్రశ్నించారు. ప్రత్యామ్నాయంగా తొట్టంబేడు, సాంబయ్యపాళెం, కల్లిపూడి వరకు ఆరులేన్ల రోడ్లను నిర్మిస్తే ఎవరికి నష్టం ఉండదు, ఇబ్బంది ఉండదని వివరించారు.

## మినరల్ వాటర్ నిల్... మద్యం బాటిళ్ళు ఫుల్!

**- గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ ఎక్కువ ధరలకు మద్యం విక్రయాలు**




యాదమరి, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో తాగడానికి మినరల్ వాటర్ బాటిళ్ళు లభించడం కష్టం కాగా ఏ గ్రామంకు వెళ్ళి రూ.30 నుండి రూ.50 అధికంగా చెల్లిస్తే ప్రభుత్వ లైసెన్సు మద్యం షాపుల్లో మాత్రమే విక్రయించాల్సి న మద్యం బాటిళ్ళు విచ్చలవిడిగా లభ్యం అవుతున్నాయి. గ్రామాల్లో సమయం సందర్భం లేకుండా మద్యం అమ్మకాలు జరుపుతుండటంతో యువత 24 గంటలు మద్యం మత్తులో ఊగే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం లైసెన్సు మంజూరు చేసిన మద్యం షాపుల్లోనే మద్యం విక్రయాలు జరుపాల్సి వున్నప్పటికీ మద్యం షాపుల యాజమానులు లాభార్జన కోసం రూ.10 అధికంగా వసూలు చేసి గ్రామాల్లోని బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేస్తున్నారు. మద్యం బెల్ట్ షాపుల నిర్వాహకులు ఒకొక్క మద్యం బాటిల్‌పై రూ.30 నుండి రూ.50 అధిక ధరలకు విక్రయిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. మద్యం బెల్టు షాపుల్లో మద్యం విక్రయాలు జరుగకుండా చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్, పోలీసు శాఖలు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. మద్యం షాపుల యాజమానులు ఎక్సైజ్, పోలీసు శాఖలను తమ గుప్పిట్లో పెట్టుకోవడంతో గ్రామాల్లో బెల్టు షాపుల్లో మద్యం విక్రయాలు యధేచ్ఛగా జరుగుతున్నప్పటికీ ఆ శాఖలు చూసిచూడనట్లు వదలివేస్తున్నారు. యాదమరి మండలంలో 3 మద్యం షాపులు వుండగా ఇందులో ఒక మద్యం షాపు నుండి ఆశించిన వ్యాపారం జరుగడం లేదు. మండల కేంద్రం యాదమరిలో రెండు షాపులు ప్రక్కప్రక్కనే వుండటంతో ఈ షాపు నిర్వాహకులు మద్యం విక్రయాలు అధికంగా జరుపడానికి ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. మద్యం షాపు పరిసరాల్లోని షాపులకు మద్యం విక్రయాలు చేయడంతో మద్యం షాపు పనివేళల అనంతరం ఈ షాపుల్లో ఎక్కువ ధరలకు మద్యం విక్రయాలు చేసి లాభాలు ఆర్జిస్తున్నారు. అలాగే గ్రామాల్లో సైతం తెల్లవారుజాము నుండి అర్ధరాత్రి వరకు బెల్టు షాపుల్లో మద్యం విక్రయాలు విచ్చలవిడిగా జరుపుతున్నారు. ఈ విషయంపై పోలీసు, ఎక్సైజ్ శాఖలు దృష్టి సారిస్తే గ్రామాల్లో యువత మద్యం వ్యవసనాలకు దూరం అయ్యే అవకాశం వుంది. ఈ మేరకు ఎక్సైజ్, పోలీసు అధికారులు చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం.

## జే శాప్ తిరుపతి జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**- అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారులుగా విజయ్ యాదవ్, హరిబాబు, నరేష్**



తిరుపతి క్రీడ, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: రాష్ట్రంలోనే ఏకైక జర్నలిస్టు క్రీడా సంఘంగా గుర్తింపు పొందిన జేశాప్ (జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) ఉమ్మడి తిరుపతి చిత్తూరు జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యింది. జేశాప్ రాష్ట్ర అధ్యక్షులు రత్నాకర్, ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, తిరుపతి జిల్లా ఇంచార్జ్ నరేష్ ఆదేశాల మేరకు శుక్రవారం తిరుపతి కరకంబాడి రోడ్డులోని సివి క్రికెట్ అకాడమీలో జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జేశాప్ గత జిల్లా కమిటీ అధ్యక్షులు తిరుపతి ఆంధ్రప్రభ రిపోర్టర్ పులుగూరు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి కాళహస్తి సాక్షి రిపోర్టర్ ఎన్.శ్రీనివాసులు సమక్షంలో పలు తీర్మానాలు చేయడం జరిగింది. ఇందులో భాగంగానే నూతన జిల్లా కమిటీని వారు ప్రకటించారు. జేశాప్ ఉమ్మడి తిరుపతి చిత్తూరు జిల్లా అధ్యక్షులుగా విజయ యాదవ్ (జీ న్యూస్), ప్రధాన కార్యదర్శిగా నారా హరిబాబు (ఆంధ్రజ్యోతి), కోశాధికారిగా నరేష్ రెడ్డి (సాక్షి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు ఉపాధ్యక్షులుగా పి.సుబ్రహ్మణ్యం (సాక్షి), దుగ్గాని ప్రసాద్(యాక్ట్) నెల్లూరు శ్రీనివాసులు (సాక్షి), ఉప కార్యదర్శు లుగా కామేశ్వరయ్య(ప్రజాశక్తి), శ్రీనివాసులు (సాక్షిటీవీ), సుబ్రహ్మణ్యం (ఆంధ్రజ్యోతి), ప్రసాద్ (సాక్షి టీవీ), సీనయ్య (ఆంధ్రప్రభ) ఎన్నిక కాగా ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నాగార్జున, ప్రతాప్ కుమార్, చిన్నబాబు, మునిశేఖర్, అమర్నాథ్, విజయ్ కుమార్, మునికృష్ణారెడ్డి, భాస్కర్, లోకేష్ రాజు, సతీష్ కుమార్, తులసి రామ్, జగదీష్, మనోహర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయిన వారిలో ఉన్నారు. జర్నలిస్టులకు క్రీడలు ఎంతో అవసరమని, జర్నలిస్టులు రాష్ట్ర స్థాయిలో క్రీడల్లో రాణించాలని రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రత్నాకర్, విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేశాప్ జిల్లా, రాష్ట్ర నాయకులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా జర్నలిస్ట్ క్రికెట్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ విరుపాక్షమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



కల్లూరు, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త: పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ దిగువ మూర్తి వారి పల్లిలో వెలసిన శ్రీ విరుపాక్షమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు పూజలు జరిపారు అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి మహా మంగళారతి గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ ధర్మకర్త గురు స్వామి అరుణ దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఫణిప్రకాష్ శర్మ, పూజ కార్యక్రమాలు నిర్వహించారు.